జనరాజకీయం కోసం...

రూ॥ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 14 పక్షపత్రిక జూలై 16-31, 2010

## అలుపెరగని పోరాట యోధుడు



జస్టిస్ సంతోష్ హెగ్డే

# ప్రభుత్వాలను శాసిస్తున్న మైనింగ్ మాఫియా

# బెంగుళూరులో లోకాయుక్త సాధికారత ఉద్యమం
























**మానవుడు సృష్టించిన వాటిలో అత్యద్భుతమైనది పుస్తకం. అలాగే దీన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడము కూడా! ఇక ఈ పుస్తకాలు చదివే ప్రజలూ అద్భుతమైన వారే!**

– మాక్సింగోర్కీ

## లోపలి పేజీల్లో...


రాబిన్‌హుడ్ రాజకీయాలు ............................ 5
టీచర్లు లేని స్కూళ్ళు........................................ 6
రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా డి.వి.వి.యస్. వర్మ........................................ 7
కృష్ణా మూడో దశ...........................................8
మద్యనియంత్రణ చైతన్య యాత్ర........................ 9
లోక్‌సత్తాయే ప్రత్యామ్నాయం........................... 10
అధికారాలున్న లోక్‌పాల్ వ్యవస్థ...................... 11
మక్కల్ శక్తి కచ్చి...........................................12
ప్రజారవాణాకు సబ్సిడీ...................................12
ప్రజాసమస్యలే క్షేత్రంగా పనిచేద్దాం....................13
జనగణనలో కొత్త కోణాలు..................................14
ప్రజలే బెల్టుషాపుల నిర్వాహకుల్ని అరెస్టు చేయవచ్చు.................................................. 15
మంచివిద్య మన ప్రాథమిక హక్కు.....................16
కార్యకర్త జెండా ఎజెండా................................. 19
జిల్లా వార్తలు .................................................20
సమాచారహక్కు – ఫీజు రీయింబర్స్‌మెంట్.............29


# ఆసుపత్రుల రేటింగ్‌కు స్వయం ప్రతిపత్తి సంస్థ అవసరం

**సంపాదకీయం**

పిల్లల చదువు, కుటుంబ ఆరోగ్యాన్ని మించి ఓ వ్యక్తి కోరుకునేది ఏమీ ఉండదు. ఆ రెండిటినీ అందరికీ చేరువగా తెచ్చే విధానాల్ని అమలు చేయాల్సి ఉంది. అత్యవసరమైన వైద్యరంగంలో ప్రభుత్వం, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా చిత్తశుద్ధితో, విజ్ఞతతో కృషిచేసినప్పుడే ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతాయి. అమెరికాలాంటి దేశంలో కూడా 85శాతం ఆసుపత్రులు లాభాపేక్ష లేకుండా సేవారంగంలో నడిచేవే.

ఆరోగ్యరంగం మిగిలిన రంగాల్లాంటిది కాదు, ప్రాణాలు అరచేతపట్టుకున్న రోగికి వారి కుటుంబానికి వినియోగదారుల హక్కుల గురించి యోచించే అవకాశం ఉండదు. ఆపత్సమయంలో సమయం వృథాకాకుండా వారికి నమ్మదగిన సమాచారాన్ని తెలియచేసేందుకు తగిన ఏర్పాట్లు ఉండాలి. సరైన వైద్యశాలల్ని అందుబాటులోకి తేవటంతోపాటు వాటి వివరాల్ని కూడా ప్రజలకు అందుబాటులోకి తేవటం ముఖ్యం. అందుకోసం ఆసుపత్రులకు సేవల నాణ్యత ప్రాతిపదికన రేటింగ్స్ ఇచ్చే, స్వయంప్రతిపత్తి గల సంస్థలు ఏర్పడాలి. వైద్యసేవలు ఎక్కడెక్కడ ఏరీతిలో అందుబాటులో ఉన్నాయో ప్రతి ఒక్కరికీ నిష్పాక్షికంగా తెలియాల్సిన అవసరముంది. మరోవైపు, సరైన వైద్యసేవల్ని, సమాచారాన్ని అందుబాటులోకి తేవటంతోపాటు వ్యాధినివారణకు కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటేనే ప్రజల ఆరోగ్యభద్రతకు భరోసా ఉంటుంది. జనాభారీత్యా ప్రపంచంలో 37వ పెద్దనగరం హైదరాబాద్‌లోని ఖరీదైన ప్రాంతాలుగా గుర్తింపు పొందిన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కూడ కలుషిత మంచినీరునే సరఫరా చేస్తున్నారు. మంచినీటి పైపుల్లో కలుస్తున్న మురుగును తొలగించటం శుద్ధిప్లాంట్లకు కూడా సాధ్యం కావటంలేదు. మంచినీటి కాలుష్యాన్ని, దోమల్ని అరికట్టటం వంటి నివారణాచర్యలు చేపట్టకుండా కేవలం వైద్యసేవలు సత్ఫలితాలనివ్వబోవు. ◆

**జీవితంలో విజయాలకు చాల ఉపాయాలున్నాయి, కానీ...మనం 'పని' చెయ్యనిదే, అవి పనిచేయవు** –షేక్‌స్పియర్

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

**జూలై 16-31, 2010 సంపుటి - 1 సంచిక - 14**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# స్పందన

లోక్‌సత్తా టైమ్స్ పత్రికను క్రమం తప్పకుండా తీసుకువస్తున్నందుకు అభినందనలు పత్రిక సకాలంలో తెస్తే మరింత సందర్భోచితంగా ఉంటుంది.

**ఎస్. భారతి, రాజమండ్రి**

లోక్‌సత్తా టైమ్స్ పత్రిక చక్కటి ముఖచిత్రాలతో వెలువడుతోంది. ఈ పత్రిక చదవడం వల్ల విభిన్న అంశాల పట్ల పార్టీ స్పందనను తెలుసుకోగలుగుతున్నాము.

**ఎమ్. స్వాతి, హైదరాబాద్**

లోక్‌సత్తా టైమ్స్ పత్రికలో వ్యాసాలు మరింత సమాచారాన్ని అందించేవిగా ఉంటే బావుంటాయి. వివిధ జిల్లాల్లో జరుగుతున్న పార్టీ కార్యక్రమాల వివరాలు మాకు మార్గదర్శకంగా ఉంటున్నాయి.

**ఎ. కృష్ణ, వరంగల్**

లోక్‌సత్తా టైమ్స్ పత్రికలో స్వాతంత్ర్య సమరయోధుల గురించి, వారు చేసిన త్యాగాలు గురించి ఈ తరం పిల్లలను ఉత్తేజితం చేసేవిగా తీసుకువస్తున్నందుకు అభినందనలు.

**ఎస్. రమణ, విజయనగరం**

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**బానిసకు బాధలు ఎక్కువ, స్వతంత్రుడికి బాధ్యతలు ఎక్కువ** –గాంధీజీ

# రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజి 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

## మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా


ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com


## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్: **సునీత అరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**

# మన అగ్రరాజ్య స్థాయిని దెబ్బతీస్తున్న రాబిన్‌హుడ్ రాజకీయాలు

## జేపీ కీలక ప్రసంగం

***తిరువనంతపురంలోని సి. అచ్యుత మీనన్ అధ్యయన కేంద్రం-గ్రంథాలయం, న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఓపెన్ వర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో... ఎన్నికల సంఘాన్ని పునర్వ్యవస్థీకరించటం నుంచి ఎన్నికల్లో డబ్బు, కండబలం ప్రభావాన్ని నిరోధించేలా వ్యవస్థను సంస్కరించటం వరకూ సమగ్ర ఎన్నికల సంస్కరణలపై చర్చ జరిగింది.***

జూలై 8న ప్రారంభకార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి ఎం. హమీద్ అన్సారీ, గవర్నర్ ఆర్.ఎస్. గవాయ్, కేరళ ముఖ్యమంత్రి వి.ఎస్ అచ్యుతానంద్, ప్రధాన ప్రతిపక్షనేత ఊమెన్ చాందీ పాల్గొన్నారు. మూడురోజుల సదస్సులో రాజకీయ పార్టీల జాతీయ నేతలతోపాటు మాజీ ఎన్నికల కమిషనర్లు, రాజకీయ పరిశోధకులు, న్యాయనిపుణులు, ప్రముఖ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.




***తిరువనంతపురంలో జూలై 8న ఎన్నికల సంస్కరణలపై జాతీయ సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తున్న భారత ఉప రాష్ట్రపతి శ్రీ ఎమ్.హమీద్ అన్సారీ***

ఈ సదస్సులో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన కీలకోపన్యాసం....

"మీడియా, మధ్యతరగతి ప్రజలు, యువత రాబిన్‌హుడ్ రాజకీయాలకు తెరదించకపోతే భారతదేశం వచ్చే ఒకట్రెండు దశాబ్దాలలో అగ్రరాజ్యంకావటం మాట అలావుంచి, ఊబిలో కూరుకుపోతుంది".

ఆధునిక దోపిడీ రాజకీయవేత్తలు ఏ పార్టీవారైనా ప్రభుత్వ ధనాన్ని పెద్దఎత్తున లూటీ చేసి, ప్రజలకు మాత్రం కొన్ని తాయిలాల్ని పంచుతూ పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే విద్యలో ఆరితేరారు. తమను దోపిడీ చేస్తున్న నేతల పట్ల ఆగ్రహించాల్సిన ప్రజలు ఆ నేతలు విసురుతున్న తాయిలాలకు కృతజ్ఞత వ్యక్తం చేస్తున్నారు. ఈ విషాదకర యధాతథస్థితిని మార్చకపోతే దేశభవిష్యత్తు అంధకారంగా మారిపోతుంది.

"కొంతమంది భయపడినట్టు ప్రజాస్వామ్యం విఫలమవలేదు. వినాశకర ఫలితాలనివ్వలేదు. నిర్ణీత వ్యవధిలో శాంతియుతంగా, పోటీవాతావరణంలో ఎన్నికలను నిర్వహించటం వల్ల ప్రజలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఆస్వాదిస్తారు. ప్రతి ఎన్నిక తర్వాత శాంతియుతంగా అధికార బదిలీ జరగటం భారతదేశంలోని ప్రజాస్వామ్యం శక్తికి నిదర్శనం. అయితే చాలావరకూ చట్టవిరుద్ధమైన మార్గాల్లో వచ్చిన డబ్బు, కండబలం ప్రభావం కనీవినీ ఎరుగని రీతిలో ఓటర్లను ప్రభావితం చేయటం ప్రజాస్వామ్యాన్ని దిగజారుస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా ఉండాల్సిన ప్రజలు ప్రస్తుత సాంప్రదాయ రాజకీయపార్టీలు నిమిత్తమాత్రులుగా, నిస్సహాయులుగా మార్చివేశాయి".

### పార్టీలు సొంత ఆస్తికాదు... ప్రజల చేతిలో సాధనాలు కావాలి

రాజకీయపార్టీలు పనితీరును సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. పార్టీలు కొద్దిమంది వ్యక్తుల సొంత ఆస్తిలా కాకుండా ప్రజలు తమ జీవితాల్ని మెరుగుపరుచుకునేందుకు ప్రజల చేతిలో సాధనాలుగా ఉపయోగపడాలి. దామాషా ఎన్నికల వ్యవస్థలోలాగా ప్రతి ఓటుకూ విలువ ఉండేలా ఎన్నికల విధానాన్ని మార్చాలి. స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. నిరంతర ఓటరు రిజిస్ట్రేషన్, తప్పులు లేకుండా ఓటరు జాబితాల ప్రకటనలో ఘోరంగా విఫలమైన ఎన్నికల సంఘం ఓ కొత్త అధ్యాయానికి నాంది పలకాలి. అవినీతిని అంతం చేయలేకపోయినా దోషుల ఆస్తుల్ని జప్తు చేసి వెంటనే జైలుకు పంపించి అవినీతిని నియంత్రించగలిగే విధంగా గట్టి చర్యలు అవసరం.

ఇటువంటి సంక్షోభాల్ని గతంలో అనేక దేశాలు కూడా చూశాయి. సరైనదిశగా ప్రయత్నంతో అధిగమించాయి. "అటువంటి సమస్యలను వందేళ్లలో కాకుండా వచ్చే పదేళ్లలో అధిగమించటమే ఈవేళ మనముందున్న సవాలు". ◆

# టీచర్లు లేని స్కూళ్లు... విద్యార్థులు లేని టీచర్లు

- రాష్ట్రం ప్రభుత్వ ప్రాథమిక విద్యావ్యవస్థ తీరు పట్ల జయప్రకాష్ నారాయణ్ తీవ్ర ఆక్రోశం
- సర్కారీ బడిని పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్

రాష్ట్రంలో 5774 ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేడు. పదిమంది విద్యార్థులకంటే తక్కువ ఉన్న పాఠశాలలు 3193 ఉన్నాయి. ఈ గణాంకాలు రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వహణ ఎంత అధ్వాన్నంగా, అసంబద్ధంగా, సిగ్గుచేటుగా ఉందో తేటతెల్లం చేస్తున్నాయి.

399 స్కూళ్లలో ఒక్కొక్కబడిలో 100మందికిపైగా విద్యార్థులున్నారు. అసలు టీచర్లే లేరు. 1562 పాఠశాలల్లో ఒక్కొక్కదాంట్లో ఐదుగురు కంటే తక్కువమంది విద్యార్థులు ఉన్నారు. ఇవన్నీ దిగ్భ్రాంతికర వాస్తవాలు.





ప్రభుత్వ పాఠశాల్లో ప్రాథమిక విద్య పట్ల వరుస ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరి వల్ల ఈవేళ రోజుకూలీలు, కూరగాయల వ్యాపారులు వంటి సామాన్యులు కూడా తమ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లకు పంపాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బులో చాలాభాగాన్ని మంచి చదువు వస్తుందన్న ఆశతో తమ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లకు పంపించేందుకు ధారపోస్తున్నారు. మధ్యతరగతివారు సర్కారీ బడులకు దాదాపు దూరమయ్యారు. తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపేవారు రాష్ట్ర అసెంబ్లీలో ఎవరైనా ఉన్నారా? ఇలాంటి దుస్థితి ప్రపంచంలోని ఏ దేశంలోనూ కన్పించదు.

తమ సంకుచిత ప్రయోజనాల్ని పరిరక్షించుకోవటానికి వీలుగా రాష్ట్రంలోని వరుస ప్రభుత్వాలు మెజారిటీ ప్రజల పిల్లల్ని నిరక్షరాస్యులుగా లేదా కాస్త అక్షరజ్ఞానం ఉన్నవారిగా లేదా నాసిరకం విద్యావంతులుగా తయారుచేస్తూ వచ్చారు. "విద్య వల్ల ప్రజలకు సాధికారత లభిస్తుంది. పేదరికాన్ని జయించి, అవినీతి ప్రభుత్వాల మీద పోరాడే శక్తి వారికి లభిస్తుంది".

తాము ఏ తప్పూ చేయకపోయినా కేవలం ఫలానా తల్లి గర్భాన పుట్టిన కారణంగానే ఈవేళ లక్షలాది మంది పిల్లలు పేదరికానికి, దుర్భర చాకిరికి పరిమితమైపోయారు. అతితక్కువ మంది పిల్లలతో చాలా ఎక్కువ స్కూళ్లు ఉండటం వల్ల ఆయా పాఠశాలలు, ఉపాధ్యాయుల మీద పర్యవేక్షణ అనేదే కొరవడుతోంది.

ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్లక్ష్యాన్ని, ఉదాసీనతను వీడి ప్రాథమిక విద్యను పునర్నిర్మించేందుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలి.

"ఒక్కొక్క పాఠశాలలో 100మంది పిల్లలు, ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా అన్ని సదుపాయాలతో కనీసం 20,000 పాఠశాలల్ని ఏర్పాటు చేయాలి". రాష్ట్రంలో ప్రస్తుతం 56,963 స్కూళ్లు ఉన్నాయి. అందులో 27లక్షల విద్యార్థులు, 111000 ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల విద్యకు భారత ప్రభుత్వం గ్రాంటుగా ఇస్తున్న నిధుల్ని వినియోగించుకోవటంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అసమర్థంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రాయోజిత పథకానికి తన వంతు వాటాను రాష్ట్రప్రభుత్వం ఇవ్వకపోవటం వల్ల సర్వశిక్షా అభియాన్‌కు రూ.1100కోట్లకు బదులు కేవలం రూ.400కోట్లు మాత్రమే గత సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఖర్చు చేయగలిగింది. ఈ ఏడాది సర్వశిక్షా అభియాన్, మాధ్యమికశిక్షా అభియాన్‌ల కింద రూ.1800 కోట్లు ఖర్చు చేయాల్సిఉన్నా కేవలం రూ.600 కోట్లు మాత్రమే వినియోగించగలిగింది. ◆



# పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షునిగా డి.వి.వి.యస్. వర్మ

- **స్థిరమైన ప్రజాఉద్యమాల దిశగా లోక్‌సత్తా**
- **ప్రచారానికి, వ్యూహాలకు, కూకట్‌పల్లికి, జాతీయస్థాయి కృషికి ఇక జయప్రకాష్ నారాయణ్ సమయం**

లోక్‌సత్తా పార్టీ ఎజెండా పట్ల ప్రజల్లో మంచి ఆదరణ ఉన్నా అది ఎన్నికల్లో ఓట్లుగా మారటానికి సమయం పడుతుందని అనుభవం, సాక్ష్యాలు రుజువు చేశాయి. దీర్ఘకాలిక ప్రయోజనాలకు, ఎప్పటికప్పుడు వచ్చే ఎన్నికలకు మధ్య ఆటుపోట్లను తట్టుకునేందుకు వీలుగా పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో, కార్యాచరణలో కొన్ని కీలకమార్పుల్ని చేశారు. "ప్రజల్లో ఆలోచనను పెంచేలా లోతైన ప్రచారంతో కార్యక్రమాల్ని నిర్వహించటం, ఆ పునాదుల మీద బలమైన, ప్రజాస్వామ్యయుతమైన సంస్థాగత నిర్మాణాన్ని చేయటం, రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో అన్ని అవకాశాల్నీ వినియోగించుకుని సాధ్యమైనన్ని మార్పుల్ని సాధించటం" అనే మూడు కోణాల్లో ఇక మీదట పార్టీ కార్యాచరణ ఉంటుంది. పార్టీ స్థిరమైన ప్రజాపోరాటాలతో నిర్దిష్ట ప్రత్యామ్నాయ వేదికగా రూపుదిద్దుకోవాలి. తీవ్ర నాయకత్వ కొరత ఉన్న సమాజంలో నాయకత్వాన్ని తయారుచేయాలి. జేపీ ఇక మీదట రాష్ట్రంలో, దేశంలో, విదేశాల్లో ప్రచారానికి, పార్టీ వ్యూహాలకు, కూకట్‌పల్లిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దటానికి, జాతీయ స్థాయి కృషికి సమయం వెచ్చిస్తారు. తాజా కార్యాచరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ సాధారణ సంస్థాగత కార్యకలాపాల బాధ్యతల్ని సీనియర్ నేత డి.వి.వి.ఎస్ వర్మకు అప్పగించారు. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా (కార్యనిర్వాహక అధ్యక్షుడిగా) నియమించారు.

**డి.వి.వి.ఎస్ వర్మను పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ జేపీ జారీచేసిన సర్క్యులర్ ప్రధానపాఠం:**

"పార్టీ అధ్యక్షునిగా సహాయంగా ఉంటూ రోజువారీ పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ, మార్గదర్శకత్వం చేసేందుకు విశ్వసనీయత, ఆమోదయోగ్యత, అంకితభావం గల సీనియర్ నేతను నియమించాల్సిన అవసరం ఉంది. దీనివల్ల పార్టీ అధ్యక్షునికి సాధారణ సంస్థాగత వ్యవహారాల భారం లేకుండా, వ్యూహాత్మక, జాతీయస్థాయి అంశాల మీద దృష్టి కేంద్రీకరించే అవకాశం కలుగుతుంది. కాబట్టి పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తొలుత ఏడాదిపాటు శ్రీ డి.వి.వి.ఎస్ వర్మను నియమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ, కోర్ కమిటీ... పార్టీ విధానాల, కార్యక్రమాల అమలుకు బాధ్యత వహిస్తారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌కి, వర్కింగ్ కమిటీకి ఈ దిగువ పేర్కొన్న ప్రధాన లక్ష్యాలున్నాయి...

1. మాస్ కాంటాక్ట్ కార్యక్రమం, శిక్షణ, విద్యారంగంలో కార్యక్రమాలు, మద్యనియంత్రణ పోరాటం, అనుబంధ సంఘాలు, దిగువ స్థాయిన ఇతర కార్యక్రమాలను దశలవారీగా నిర్వహించాలి. తద్వారా పార్టీని లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్తూ పటిష్టంగా నిర్మించాలి.
2. సభ్యత్వ నమోదు కార్యక్రమం, దశలవారీగా గ్రామ, మండల స్థాయిలో సంస్థాగత ఎన్నికల్ని నిర్వహించి 12-18 నెలల కాలవ్యవధిలో జిల్లా, రాష్ట్రస్థాయి ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయాలి.
3. పార్టీ ప్రధాన కార్యాలయంలో రోజువారీ కార్యక్రమాల నిర్వహణ
4. పార్టీ కార్యక్రమాలకు వనరుల సమీకరణ

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కోర్ గ్రూప్ పార్టీ అధ్యక్షునికి జవాబుదారీగా వ్యవహరించడం కార్యకలాపాల గురించి ప్రతి 15రోజులకోసారి వివరించాలి. పార్టీ స్థూల నిబంధనలు, విధానాల పరిధిలో పూర్తి స్వయంప్రతిపత్తితో పనిచేసే స్వేచ్ఛ వారికి ఉంటుంది". ◆

## జులై 1, 2 తేదీల్లో లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ సమావేశం

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జులై 1, 2వ తేదీల్లో జరిగింది. ఇక్కడ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించారు.

మునిసిపల్ ఎన్నికలకు పార్టీ జిల్లా శాఖలను సన్నద్ధం చేసేందుకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలకు అద్భుత స్పందన లభించింది. మునిసిపోల్స్‌పై భవిష్యత్తు కార్యాచరణ, మద్యనియంత్రణ పోరాటంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితి, పార్టీ సంస్థాగత పునర్నిర్మాణం ఎజెండాగా సమావేశంలో తీర్మానాలు చేశారు.

### రాజధాని దాహార్తిని తీర్చేందుకు

# కృష్ణా మూడోదశను అమలుచేయండి

- **గోదావరి జలాల్ని తేవటం పేరుతో ప్రజాధనం వృధా, దోపిడీ**
- **ముఖ్యమంత్రికి జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి-**



" ప్రతిష్టకు పోకండి. భారీ ఖర్చుతోపాటు ఎన్నో ఏళ్లు పట్టే గోదావరి నదీ జలాలను తరలించటం వంటి పథకాలను కొనసాగించే ప్రయత్నాల్ని విరమించండి". రాష్ట్ర రాజధాని ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృష్ణాజలాల మంచినీటి పథకం మూడోదశను చేపట్టాలని జేపి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్ నగరానికి ఇప్పటికే 11 టీఎంసీల కృష్ణాజలాలను తీసుకొస్తుండటం వల్ల రాజధాని ప్రజలకు రోజుకు 180 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) మంచినీటిని సరఫరా చేయగలుగుతున్నారు. రెండు దశల్లో అమలైన ఆ స్కీము వల్ల మహానగరానికి ఎంతో ఊరట కలిగింది. మూడోదశ ప్రణాళికను రూ.600కోట్లతో పూర్తిచేయటం వల్ల మరో 5.5 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ నుంచి తీసుకోవచ్చు. అదనంగా 90 ఎంజీడీల మంచినీటిని ప్రజలకు అందించవచ్చు.

హైదరాబాద్‌కు ప్రధాన మంచినీటి వనరుగా ఉన్న ఉస్మాన్ సాగర్ ఈ ఏడాది ఎండిపోవటం వల్ల గత కొన్నివారాలుగా 15 ఎంజీడీల నీటికొరతతో రాజధానివాసులు మంచినీటి కటకటను ఎదుర్కొంటున్నారు. కృష్ణా మూడోదశ పథకాన్ని ప్రభుత్వం విడిచిపెట్టకుండా ఉంటే, పౌరులకు ఈ ఇబ్బంది వచ్చేదే కాదు.

కేవలం రెండేళ్లలో కృష్ణా మంచినీటి పథకాన్ని ప్రభుత్వం పూర్తి చేయగలుగుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పౌరులకు కనీసం వచ్చే ఐదేళ్ల పాటు మంచినీటి సమస్య తీరుతుంది. కరవు ప్రభావం తీవ్రంగా ఉన్న సంవత్సరంలో కూడా హైదరాబాద్‌లో మంచినీటి కొరత రాలేదంటే, నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ స్థాయిలో ఎప్పుడూ 180 టీఎంసీల నీరు ఉండటమే కారణం.

అందుకు భిన్నంగా, హైదరాబాద్‌కు ప్రభుత్వం నీటిని తీసుకురావటానికి గోదావరి మీద రిజర్వాయర్ ఏదీ లేదు. గోదావరి పథకంలో ఎంతో ఎత్తుకు నీటిని ఎత్తి పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఎక్కువ దూరం తీసుకెళ్లాల్సి ఉంటుంది. గోదావరి స్కీముకు సుమారు రూ.3,500 కోట్లు ఖర్చవుతుంది. పూర్తి కావటానికి కూడా ఎన్నో ఏళ్లు పడుతుంది. ప్రభుత్వం ఇప్పటికే గోదావరి పథకం మీద గత రెండు సంవత్సరాలుగా కొన్ని వందల కోట్లు ఖర్చు పెట్టింది తప్ప ఇంతవరకూ ఒక్క చుక్క నీరు కూడా రాజధానికి తీసుకురాలేదు.

ఆర్థిక వ్యవహారాల్లో విజ్ఞతతో వ్యవహరించే ముఖ్యమంత్రి రోశయ్య గోదావరి పథకం పేరుతో జరుగుతున్న వృధాను కూడా అడ్డుకోవాలి. " తమ వ్యక్తిగత స్వార్థం కోసం ఖరీదైన ప్రాజెక్టులను ముందుకు తెస్తున్న వారి మాటలకు మోసపోవద్దు. రాజధాని పౌరుల దాహార్తిని తీర్చేందుకు కృష్ణా మంచినీటిపథకం మూడోదశను చేపట్టాలి. ◆

## ఉపకార వేతనాల బకాయిలు చెల్లించండి

- **విద్యార్థులకు వెంటనే బోధనాఫీజులు, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై పరిస్థితి**
- **ఇంతదాకా రావటం విచారకరం: లోక్‌సత్తా**

ఉన్నత విద్యలో ఫీజు రీఇంబర్స్‌మెంట్‌పై పరిస్థితి ఇంత గందరగోళం నెలకొనటం పట్ల లోక్‌సత్తా పార్టీ తీవ్ర విచారాన్ని వ్యక్తంచేసింది. అర్హులైన విద్యార్థులందరికీ వారి భవిష్యత్తు దృష్ట్యా వెంటనే ప్రభుత్వం స్పందించి బోధనా ఫీజుల్ని చెల్లించాలి. బోధనా ఫీజులు, ఉపకార వేతనం బకాయిలు తక్షణం చెల్లించాలి. అటు కళాశాల యాజమాన్యాల తీరుతో ఇప్పటికే ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు తాజాగా రాజకీయాల తీరుతో అవాంఛనీయ ఆవేశకావేషాలకు లోనవుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలి. డబ్బులేని కారణంగా ఏ ఒక్క విద్యార్థీ ఉన్నత విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలి.

# మద్యనియంత్రణ చైతన్యయాత్ర

- **7న దూబగుంట నుంచి లోక్‌సత్తా యాత్ర 22 వరకూ... 16 జిల్లాలు... శ్రీకాకుళం వరకూ**
- **చైతన్యరథానికి జెండా ఊపి ప్రారంభించిన జేపీ**

రాష్ట్రంలో లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాల్ని చిదిమేస్తూ, యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న మద్యంమహమ్మారికి వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరిస్తూ కఠిన మద్యనియంత్రణను సాధించేందుకు పొట్టిశ్రీరాములు దూబగుంట నెల్లూరు జిల్లా (సింహపురి)లోని దూబగుంట గ్రామాన్ని ఒకప్పుడు మద్యనిషేధం శంఖారావం చేసి మహిళల్ని, అన్నివర్గాల్నీ ఏకం చేసి కదంతొక్కించి ఆంధ్రప్రదేశ్‌ను కదిలించినఒక స్ఫూర్తికి సంకేతంగా భావించి లోక్‌సత్తా అక్కడ్నుంచి మద్యనియంత్రణ చైతన్యయాత్రను ప్రారంభించింది. నెల్లూరు జిల్లాతో మొదలుపెట్టి ఉప ఎన్నికలు జరుగుతున్న జిల్లాలు మినహాయించి శ్రీకాకుళం వరకూ మొత్తం 16 జిల్లాల్లో ఈ నెల 22వరకూ ఈ యాత్ర కొనసాగుతుంది. పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ జూలై 6న హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద చైతన్యరథానికి జెండా ఊపి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.




### లోక్‌సత్తా మద్యనియంత్రణ చైతన్యయాత్ర వివరాలు

మద్యనియంత్రణ చైతన్య యాత్రలో భాగంగా, ప్రతిజిల్లాలో ఎంపిక చేసిన గ్రామంలో బెల్టుషాపుల్ని గుర్తించి మూసివేయటం, బెల్టుషాపుల నిర్వాహకుల చేత ఇక ముందు అటువంటి వ్యాపారం చేయబోమని ప్రజల ముందు ప్రమాణం చేయించటం, బెల్టు దుకాణాలు తిరిగి తలెత్తకుండా స్థానిక ప్రజల చేత ఒక కమిటీని ఏర్పాటు చేయటం, జిల్లా కేంద్రంలో మద్యం బాధిత కుటుంబాలు, వివిధ సంఘాలు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించటం, అనధికార సిట్టింగ్ రూం ఉన్న వైన్ షాపు యజమానిని, ఆ ఇంటి యజమానిని, అక్కడ తాగుబోతులను కూడా ప్రజాఅరెస్టులు చేయటం ద్వారా ప్రతి జిల్లాలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ వారిని ఈ పోరాటంలో భాగస్వాముల్ని చేసేందుకు లోక్‌సత్తా ఒక వేదికగా కృషిచేస్తోంది.

7వ తేదీన నెల్లూరు జిల్లా, 8న ప్రకాశం, 9న గుంటూరు, 10న కృష్ణా, 11న చిత్తూరు, 12న కడప, 13న అనంతపురం, 14న కర్నూలు, 15న మహబూబ్‌నగర్, 16న నల్గండ, 17న ఖమ్మం, 18న పశ్చిమ గోదావరి, 19న తూర్పుగోదావరి, 20న విశాఖపట్నం, 21న విజయనగరం, 22న శ్రీకాకుళం జిల్లాలో యాత్ర జరుగుతోంది. ◆

## 26నుంచి జోన్లువారీగా లోక్‌సత్తా మున్సిపోల్స్ శిక్షణాకార్యక్రమాలు

త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసేందుకు జిల్లాల నేతలకు జోన్లువారీగా లోక్‌సత్తా నిర్వహించతలపెట్టిన శిక్షణాకార్యక్రమాలు జూన్ 26న ప్రారంభం అయ్యాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ శిక్షణాకార్యక్రమాలు... తెలంగాణ జిల్లాలకు హైదరాబాద్‌లో, రాయలసీమ జిల్లాలకు తిరుపతిలో, దక్షిణ కోస్తా జిల్లాలకు ఒంగోలులో, ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు కాకినాడలో జరిగాయి.

జోన్‌కో బృందం చొప్పున సీనియర్ నాయకులు 4 బృందాలుగా శిక్షణ ఇస్తారు. తెలంగాణ జిల్లాలకు జి. రాజారెడ్డి, పి. భాస్కరరావు, కార్తీక్‌చంద్ర, ఉభయగోదావరి సహా ఉత్తరాంధ్ర జిల్లాలకు డి.వి.వి.ఎస్ వర్మ, వై.డి రామారావు, భీశెట్టి బాబ్జీ, దక్షిణ కోస్తా జిల్లాలకు కటారి శ్రీనివాసరావు, డా॥ పాండురంగారావు, మాధవ్, రాయలసీమ జిల్లాలకు వి. విజయేందర్ రెడ్డి, బండారు రామ్మోహనరావు, వెంకటరమణతో కూడిన బృందాలు శిక్షణ ఇచ్చాయి.

శిక్షణలో భాగంగా స్థానిక సమస్యలను గుర్తించి నిర్దిష్ట పరిష్కారాలతో వార్డు మేనిఫెస్టోని రూపొందించటం, మద్యనియంత్రణ పై పోరాటం, స్థానిక పాలన ఆవశ్యకతను తెలియచేస్తూ ఓటింగ్‌శాతం పెంచటం, ఎన్నికల ప్రచార నిధులు సమకూర్చుకోవటం, నాయకత్వం అంశాలపై శిక్షణనిస్తారు. ఈ కార్యక్రమాల్లో ప్రధాన శిక్షణ పొందిన జిల్లాల నేతలు ఆ తర్వాత కార్పొరేషన్లలో స్థానిక నేతలకు, అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు.

# రాష్ట్రంలో లోక్‌సత్తాయే ప్రత్యామ్నాయం

- కాంగ్రెస్‌కు నాయకత్వం లేదు, అవినీతిలో కూరుకుపోయింది
- తెలుగుదేశానికి దిశ, విశ్వసనీయత లేదు
- ప్రజల్లోకి లోతుగా వెళ్లేందుకు పౌరసత్వం, పల్లెవెలుగు కార్యక్రమాలు
- లోక్‌సత్తా రెండోదశ కార్యాచరణను ప్రకటించిన జేపీ

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకత్వం లేక, అవినీతిలో కూరుకుపోయి సంక్షోభంలో ఉంది. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం విశ్వసనీయత కోల్పోయి, దిశానిర్దేశం లేకుండా గందరగోళంలో ఉంది. ఈ తరుణంలో హేతుబద్ధ ఎజెండాతో, చెప్పింది చేసి చూపే నిబద్ధతతో చేస్తున్న కృషి లోక్‌సత్తా పార్టీని ప్రత్యామ్నాయంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు లోతైన ప్రచారాన్ని చేపడుతున్నాం. రాజకీయాల్లోని కుళ్లును చూసి నిస్సహాయులుగా ఉన్నామనుకున్నవారంతా ముందుకు వచ్చి రాజకీయాల్లో పాలుపంచుకునేందుకు సమాయత్తం చేసేందుకు లోక్‌సత్తా రెండోదశ కార్యాచరణను ప్రారంభించింది. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ "లోక్‌సత్తాను ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటివరకూ అవినీతి నిర్మూలన, అందరికీ విద్య, ఆరోగ్యం, జనం చేతికి అధికారం తదితర విలువైన భావజాలంతో ప్రచారం చేశాం. అయితే తమ రాజకీయ దోపిడీలో భాగంగా సంప్రదాయపార్టీలు సామాన్య ప్రజల్ని చైతన్యవంతులు కాకుండా నిస్తేజం చేయటంతో ఆ ప్రచారం సరిపోలేదు. అందుకే దశలవారీగా లోతైన ప్రచారాన్ని చేపడుతున్నాం. ఇందులో భాగంగా గ్రామగ్రామానా ముఖాముఖి కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాం. పౌరసత్వం పేరుతో పట్టణాల్లో, పల్లెవెలుగు పేరుతో గ్రామాల్లో స్థానిక పాలన పట్ల చైతన్యం కలిగిస్తాము. తమిళనాడులోని అళందూరు పట్టణంలో ప్రజలంతా కలిసికట్టుగా చందాలు వేసుకుని డ్రైనేజీ వ్యవస్థ, ఇతర సమస్యల్ని పరిష్కరించుకున్నారు. కేవలం ఐదేళ్లలో అక్కడ స్థలాలకు అనేకరెట్లు రేట్లు పెరగటమేకాకుండా అన్నిరకాలుగా అభివృద్ధిని సాధించింది. ఇదే నమూనాను రాష్ట్రంలో సాధించేందుకు కృషి చేస్తాం. సభ్యత్వ నమోదు నిర్ణీత సంఖ్యకు రాగానే రహస్య బ్యాలెట్ ద్వారా గ్రామస్థాయి నుంచి ఎక్కడికక్కడ ఎన్నికలు నిర్వహిస్తాం".

"దాంతోపాటు మద్యనియంత్రణ కోసం లోక్‌సత్తా పోరాటాన్ని కూడా దశలవారీగా ఉధృతం చేస్తాం. మద్యానికి వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించి గ్రామస్థాయి నుంచి పోరాటాల్ని చేస్తాం. తొలుత 39 మున్సిపాలిటీల్లో, 20 రూరల్ నియోజకవర్గాల్లో ప్రారంభిస్తున్నాం. ఈవేళ అధికార, ప్రతిపక్ష అని తేడా లేకుండా అన్ని పార్టీలూ మద్యం వ్యాపారంలో పాలుపంచుకుని ఆ తర్వాత మొసలి కన్నీరు కారుస్తున్నాయి. లోక్‌సత్తా ఒక్కటే నిజాయతీగా తొలినుంచీ ఒకేమాట మీద నిలబడుతూ ప్రజల పక్షాన కృషి చేస్తోంది. పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్యం వంటి అంశాల మీద దృష్టిపెట్టకుండా రాష్ట్రంలో ప్రభుత్వం తాత్కాలిక పథకాల మీద దృష్టి పెట్టి ఆర్థికంగా దివాళా దిశగా వెళ్తోంది. ప్రతిపక్ష టీడీపీ కూడా అదే బాటలో ప్రయాణిస్తోంది. కేవలం రెండుగంటలు వర్షం పడితే హైదరాబాద్‌లో పరిస్థితి అధ్వాన్నంగా మారటాన్ని చూస్తే, పాలకులు ఎలాంటి అభివృద్ధిని చేస్తున్నారో అర్థమవుతోంది. రాష్ట్రం చిందరవందర కాకముందే ఆలోచనాపరులు, యువత మేలుకొని తమ వంతు ప్రతిఘటనకు సిద్ధంకావాలి". అన్నారు.

పార్టీ ప్రచారానికి ఎక్కువ సమయం ఇచ్చేందుకు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, అవినీతి నిరోధక బిల్లులోని లోపాల్ని సరిచేయటం వంటి అంశాల మీద జాతీయస్థాయిలో కృషి చేసేందుకు జేపీ సమయంలో కొంత వెసులుబాటు కోసం డి.వి.వి.ఎస్ వర్మను రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షునిగా నియమించడం జరిగింది.

డి.వి.వి.ఎస్ వర్మ మాట్లాడుతూ, "లోక్‌సత్తా దిగువస్థాయిలో బలంగా లేదనే విమర్శలకు జవాబుచెప్పేలా తాజాగా నిర్ణయించిన రాజకీయ కార్యాచరణ వచ్చే 15రోజుల్లో ప్రారంభమవుతుంది. బీసీ గణన పేరుతో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రభుత్వమే రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే. వార్డు కమిటీల్ని ఏర్పాటు చేసి సెప్టెంబర్‌లో, సకాలంలో ఎన్నికలు జరపాలి". అన్నారు.

మద్యంపై రాష్ట్ర కార్యవర్గం ఆమోదించిన తీర్మానాన్ని కటారి శ్రీనివాసరావు చదివి వినిపించారు. "సంప్రదాయపార్టీలు మద్యం మీద నిజంగా పోరాడాలనుకుంటున్న పార్టీలు మద్యం వ్యాపారంతో ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని సంబంధం ఉన్నవారెవరికీ పార్టీ పదవులుగానీ, ఎన్నికలలో పోటీ చేసే అవకాశంగానీ ఇవ్వకూడదు. అలాంటివారు ఉంటే వెంటనే ఆ పదవుల నుంచి తొలగించాలి. అటువంటి నేతల జాబితాను తయారుచేసేందుకు ఒక సమాజంలోని నిష్పాక్షిక నిపుణులతో ఒక స్వయంప్రతిపత్తి గల కమిటీని వేయాలి. మద్యనియంత్రణ కోసం ప్రజలను చైతన్యపరిచేందుకు కళాజాతలు, ప్రదర్శనలు, కార్యక్రమాలు నిర్వహిస్తుంది". ◆

# అధికారాలు, నిధులున్న లోక్‌పాల్/ రాష్ట్రీయ లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటుచేయాలి : జయప్రకాష్ నారాయణ్

- అవినీతిపై పోరును ఢిల్లీకి తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా సన్నాహాలు
- అవినీతి నిరోధక చట్టాన్ని సవరించాలని ప్రధానిని కలుస్తాం
- కర్ణాటక లోకాయుక్తకు పార్టీ సంఘీభావం

అవినీతి నిరోధక చట్టానికి సమగ్ర సవరణ చేయాలనే డిమాండ్‌తో ప్రధానమంత్రి వద్దకు ప్రతినిధి బృందాన్ని తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా చొరవ తీసుకుంటుంది.

భారత్‌లో విశృంఖలంగా పెరిగిపోతున్న అవినీతి ఇతరదేశాల ముందు మనల్ని నవ్వులపాలు చేస్తోంది. ఎటుచూసినా జడలుపరుచుకుంటూ, అంతకంతకూ పెరుగుతున్న అవినీతిని నిరోధించకుండా బలమైన ఆర్థికశక్తిగా అవతరించాలన్న తన కలను భారతదేశం సాకారం చేసుకోలేదు.

లోకాయుక్త సిఫార్సుల్ని అమలు చేయటంలో విఫలమవటం, అవినీతి అధికారులను తిరిగి పదవుల్లోకి తీసుకోవటం, అవినీతి కార్యకలాపాలపై దర్యాప్తులో ఉన్న లోకాయుక్త ఉద్యోగులను వేధించటం వంటి చర్యలకు పాల్పడుతున్న కర్ణాటక ప్రభుత్వ వైఖరికి ప్రతిఘటనగా కర్ణాటక లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే రాజీనామా చేయటంపై జేపీ తీవ్రంగా స్పందించారు. జస్టిస్ సంతోష్ హెగ్డేతో జేపీ స్వయంగా ఫోన్లో మాట్లాడి సంఘీభావం తెలియచేశారు. దాంతోపాటు కర్ణాటక లోక్‌సత్తా పార్టీ బృందం కూడా కర్ణాటక గవర్నర్‌ను కలిసి అత్యంత గౌరవప్రదమైన వ్యవస్థ పట్ల ప్రభుత్వం వ్యతిరేక ధోరణితో వ్యవహరించటం పట్ల నిరసన వ్యక్తం చేసింది.



"అవినీతికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన జస్టిస్ హెగ్డే వంటి వ్యక్తి రాజీనామా చేయటం కర్ణాటక ప్రభుత్వ నైతిక దివాళాకోరుతనాన్ని తేటతెల్లం చేస్తోంది''. తొలుత జస్టిస్ వెంకటాచలం, ఇప్పటివరకు జస్టిస్ సంతోష్ హెగ్డే... ఇలా సుప్రీంకోర్టు న్యాయమూర్తులైన ఇద్దరు ప్రతిభావంతులైన న్యాయనిపుణులు కర్ణాటక లోకాయుక్త స్థానంలో ఉన్నారు. ఈ విషయంలో మిగిలిన రాష్ట్రాలకన్నా కర్ణాటక చాలా అదృష్టం చేసుకున్నట్టే. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం, అంతకుముందున్న కాంగ్రెస్ ప్రభుత్వం లోకాయుక్తకు అధికారాల్ని, నిధుల్ని, సిబ్బందిని ఇవ్వకుండా దానిని కోరలులేని సంస్థగా మార్చేశాయి. ఆంధ్రప్రదేశ్ సహా మిగిలిన రాష్ట్రాల్లో పరిస్థితి అంతకంటే ఘోరంగా ఉంది.

అమెరికాలో పన్ను ఎగ్గొట్టి నల్లధనాన్ని దాచుకున్న వారి పేర్లను బైటపెట్టేలా స్విట్జర్లాండ్ బ్యాంకు దిగ్గజం మెడను వంచటంలో అమెరికా ప్రభుత్వం సఫలమైన తరుణంలో మనదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతిని విచ్చలవిడిగా పెరిగిపోయేందుకు అవకాశమిస్తుండటం విషాదకరం.

**లోక్‌పాల్/ రాష్ట్రీయ లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటు చేయాలి ముఖ్యమంత్రులనూ ఆ పరిధిలోకి తేవాలి**

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి స్థాయి న్యాయకోవిదుని ఆధ్వర్యంలో లోక్‌పాల్ లేదా రాష్ట్రీయ లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటుచేసేలా అవినీతి నిరోధక చట్టాన్ని సవరించాలని లోక్‌సత్తా ఆధ్వర్యంలో ప్రధానిని కలిసే బృందం కోరుతుంది. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ), కేంద్ర నేరపరిశోధనా సంస్థ (సీబీఐ), ఆ తరహా ఇతర సంస్థలన్నీ లోక్‌పాల్/ రాష్ట్రీయ లోకాయుక్త పరిధిలోకి రావాలి. ఆ సంస్థలకు పూర్తి అధికారాలు, నిధులు ఇచ్చి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరిపై, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్, ఉన్నత న్యాయవ్యవస్థ మినహాయించి ఎన్నికైన ప్రజాప్రతినిధులందరిపై వచ్చే అవినీతి ఆరోపణల మీద విచారించే అధికారాలుండాలి. అలాగే ముఖ్యమంత్రుల పై కూడా విచారించే అధికారం ఉండాలి.

**రాష్ట్రస్థాయిలో సాధికారిక లోకాయుక్త**

ఆ సవరణ ద్వారా రాష్ట్రస్థాయిలో అధికారాలు, నిధులు ఉన్న లోకాయుక్త ఏర్పాటవుతుంది. ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో), విజిలెన్స్ కమిషన్ సహా అవినీతి నిరోధక సంస్థలన్నీ ఆ సంస్థ పరిధిలోకే వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరిపైనా, ముఖ్యమంత్రి మినహా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరిపైనా అవినీతి ఆరోపణల మీద రాష్ట్ర లోకాయుక్తకు విచారణాధికారం ఉంటుంది.

జాతీయ స్థాయిలో లోక్‌పాల్/ రాష్ట్రీయ లోకాయుక్త, రాష్ట్ర స్థాయిలో లోకాయుక్తకు విచారణ సమయంలో అక్రమ ఆస్తుల స్వాధీనం, జప్తునకు ఆదేశాలిచ్చే అధికారాలు ఉంటాయి.

పేదల్ని అవినీతి మరింత పేదలుగా మారుస్తుంది. ఆర్థికాభివృద్ధిని, పెట్టుబడులను దెబ్బతీస్తుంది. అవినీతికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సదస్సులో సంతకం చేసిన భారత్... అవినీతిపై సరైన చర్యలు చేపట్టకపోతే తన ప్రతిష్ఠను కోల్పోవలసి వుంటుంది. ◆

## ప్రజారవాణా వ్యవస్థకు సబ్సిడీ ఇవ్వాలి : జయప్రకాష్ నారాయణ్

- **చమురు విధానం అసంబద్ధం, ఏకపక్షం**

ప్రజా రోడ్డురవాణా వ్యవస్థలు, రైల్వేలు వినియోగించే డీజిల్‌పై సబ్సిడీని ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. "ఏటా ప్రజా రోడ్డు రవాణా వ్యవస్థలు 500కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తుండగా, రైల్వేలు సుమారు 250కోట్ల లీటర్లను వినియోగిస్తున్నాయి. ఆ రెండు అతిపెద్ద రవాణావ్యవస్థలకూ ప్రభుత్వం లీటరుకు రూ.10 సబ్సిడీని ఇస్తే ఖజానాపై రూ.7500 కోట్ల మేరకు మాత్రమే భారం పడుతుంది. ప్రస్తుతం ఇస్తున్న రూ.74,000కోట్ల సబ్సిడీలో అది కేవలం 10శాతం మాత్రమే.

ప్రభుత్వ సబ్సిడీ విధానం తాత్కాలిక ధోరణితో, ఏకపక్షంగా, అసంబద్ధంగా ఉంది. కిరోసిన్, ఎల్పీజీపై స్థిరమైన సబ్సిడీని ఇవ్వాలి. పేదలకు సౌరప్యానెల్‌తో కూడిన ఎల్.ఇ.డి లాంతర్లను సరఫరా చేయటం ద్వారా కిరోసిన్ వినియోగాన్ని, సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవచ్చు. ఎక్సైజ్ పన్ను మినహాయింపుతో బస్సుల ద్వారా ప్రజారవాణాను ప్రోత్సహించవచ్చు.



డీజిల్ సబ్సిడీని అందించటం ద్వారా, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల నిర్మాణాన్ని చేపట్టి తద్వారా ప్రజారవాణాను ప్రోత్సహించాలి. అటువంటి విధానం సామాన్య పౌరుని మీద భారాన్ని తగ్గించి ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. భారతదేశంలో ప్రజారవాణా వ్యవస్థ అధ్వాన్నంగా ఉండబట్టే ప్రజలు సొంత వాహనాలను వినియోగిస్తున్నారని ప్రభుత్వం గుర్తించాలి". ఈ వాస్తవాలను, పరిష్కారాలను ప్రధానమంత్రికి, ఆర్థికమంత్రికి, చమురు, సహజవాయువు మంత్రికి, ప్రణాళికాసంఘానికి కూడా తెలియచేసామని పార్టీ తెలిపింది.

# తమిళనాడులో మక్కల్ శక్తి కచ్చి ఇక లోక్‌సత్తా

### ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించిన జేపీ

తమిళనాడులోని 'మక్కల్ శక్తి కచ్చి' (జనబలం పార్టీ అని అర్థం) ఇక మీదట తమిళనాడు లోక్‌సత్తా పార్టీ విభాగంగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటించింది. తాము లక్ష్యంగా పెట్టుకున్న అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, కులరహిత సమాజం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, అవినీతిపై పోరాటం ఎజెండాతో లోక్‌సత్తా పార్టీ ఇప్పటికే స్థిరంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్నందున మరోపార్టీ అవసరంలేకుండా లోక్‌సత్తాగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్టు మక్కల్ శక్తి కచ్చి ప్రతినిధులు తెలిపారు. చెన్నై నుంచి వచ్చిన సంస్థ 8మంది మక్కల్ శక్తి కచ్చి స్టీరింగ్ కమిటీ సభ్యులు లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను ఇక్కడ జూన్29న పార్టీ ప్రధాన కార్యాలయంలో కలుసుకుని తమ నిర్ణయాన్ని వెల్లడించారు. బృందంలో సెంథిల్ ఆర్ముగం, ప్రభాకర్, ఉదయ్ కుమార్, శివశంకర్, శివ ఇలాంగో, సంతీష్, సత్యరాజ్, మోహన్ ఉన్నారు. తమిళనాడులో లోక్‌సత్తా పార్టీని ముందుకు తీసుకెళ్లటానికి చేపట్టాల్సిన చర్యల మీద వారంతా జేపీతో చర్చించారు.

ఏడాది వయసున్న ఆ పార్టీ సభ్యుల్లో చాలామంది 1988లో ఉదయ మూర్తి స్థాపించిన మక్కల్ శక్తి ఇయక్కంలో క్రియాశీల సభ్యులుగా పనిచేసి, ఉద్యమం నుంచి బైటికొచ్చి రాజకీయ పార్టీని స్థాపించారు. తాము ఇప్పటికే తమిళనాడులో 2009లో జరిగిన కొన్ని ఉప ఎన్నికల్లో పాల్గొన్నామని, ఏరులై పారుతున్న మద్యానికి



వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించి పోరాడుతున్నామని తెలిపారు.

మక్కల్ శక్తి కచ్చి నిర్ణయం పట్ల జేపీ హర్షం వ్యక్తం చేస్తూ, "లోక్‌సత్తా తమిళనాడు విభాగం నాయకత్వంతో కలిసికట్టుగా కృషి చేస్తూ పార్టీ నిర్మాణం మీద దృష్టి పెట్టాలి. ఆ రాష్ట్రంలోని మొత్తం 32 జిల్లాల్లో కనీసం 10-12 జిల్లాల్లో బలమైన శాఖలతో చురుగ్గా కార్యకలాపాలు చేయాలి. విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన, అధికార వికేంద్రీకరణ, మద్యనియంత్రణ అంశాల మీద నిర్మాణాత్మకంగా పనిచేయాలి. ప్రతి అంశం మీద పార్టీ విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా తెలియచేయాలి. పౌరసేవా కేంద్రాల ఏర్పాటు, చిన్నపట్టణాల అభివృద్ధి, ప్రజాధనం ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా ప్రభుత్వ విధానాలను మలిచేందుకు పోరాడాలి. రాజకీయాల్లో బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలి అన్నారు". ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలపై జేపీ వారికి వివరించారు. ◆

# ప్రజా సమస్యలే క్షేత్రంగా పనిచేద్దాం : లోక్‌సత్తా

**- వై.డి. రామారావు**

*మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజా సమస్యలే క్షేత్రంగా పనిచేయాలని రాష్ట్ర లోక్‌సత్తా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వి.వి.యస్. వర్మ పిలుపునిచ్చారు. కార్యకర్తలు పార్టీగా కాకుండా, పేదలు, మధ్య తరగతి వర్గాల పార్టీగా లోక్‌సత్తా పార్టీ ఎదగాలని దానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వర్మ పిలుపునిచ్చారు.*





శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాల లోక్‌సత్తా కార్యకర్తలు శిక్షణ రెండవ రోజు ప్రారంభోపన్యాసం చేశారు. స్థానిక ఎన్నికలు వచ్చినప్పుడల్లా పలు సాంప్రదాయ పార్టీలు ప్రజల సమస్యల ప్రస్తావన లేకుండా కేవలం ఉపరితల అంశాల ప్రస్తావన తెస్తున్నామని, ప్రజల సమస్యలే ఎజెండాగా లోక్‌సత్తా ముందుకెళ్ళాలని శిక్షణా కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు అన్నారు. వార్డు పట్టణ, నగరస్థాయిలో ప్రజా సమస్యలు ప్రస్తావించే అంశాలతో "ప్రజామేనిఫెస్టో" రూపొందించే విధానాన్ని ఆయన వివరించారు. ఓటు మాకు అధికారం మీకు అనే నినాదంతో ప్రజలలోకి వెళ్ళాలన్నారు. ప్రజా సమస్యలు గుర్తించి పార్టీ కార్యక్రమాల ద్వారా, పార్టీ నినాదాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళడానికి అవసరమైన నైపుణ్యాన్ని లోక్‌సత్తా కార్యకర్తలు నేర్చుకోవాలని రామ్మోహన్‌రావు అన్నారు.

మున్సిపల్ కార్యక్రమాల రాష్ట్ర బాధ్యులు వై.డి.రామారావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను రూపొందించుకుని స్థానిక ప్రభుత్వాలపై 'ఇంటి ముందు ప్రభుత్వం, కంటి ముందు పాలన' లోక్‌సత్తా ఎజెండాను ప్రజలలోకి తీసుకెళతామని అన్నారు.

పట్టణ ప్రాంత ఓటర్లను ఆకట్టుకునే విధంగా లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలను తీర్చిదిద్దబడే ఈ శిక్షణ అని ఆయన వివరించారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ స్థానిక కార్యక్రమాలను పార్టీ మెసేజ్‌తో జత చేసి కార్యక్రమాలను నిర్వహించాలని 'కాకినాడ పార్లమెంటు' పార్టీ అధ్యక్షులు కరణం వెంకటేశ్వరరావు కోరారు.

'ఇంటి ముందు ప్రభుత్వం కంటి ముందు పాలన' నినాదంతో ప్రజలకు చేరువ కావాలని రాష్ట్ర మాస్టర్ ట్రెనర్ కార్తీక్ చంద్ర అన్నారు. ఐదు జిల్లాల నుండి లోక్‌సత్తా శిక్షణకు వచ్చిన వారిని కాకినాడ నగర అధ్యక్షుడు నెక్కంటి శ్రీనివాస్ స్వాగతం పలికారు.




మూడు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు డా॥ ఆలూరి విజయలక్ష్మి, యస్. మనోరమ జిల్లా పార్టీల అధ్యక్షులు జానకిరామరాజు, పోలినాయుడు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. ◆

# జనగణనలో బయటపడిన కొత్తకోణాలు

- వరప్రసాద్ కె.వి.యన్.డి

- పూర్తయిన తొలిదశ జనగణన
- రాష్ట్ర జనాభా 9 కోట్లు
- మొత్తం 2.35 కోట్ల కుటుంబాలు
- విస్తరిస్తున్న చిన్న కుటుంబాలు
- తగ్గిన కుటుంబ సభ్యుల సగటు

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకోనున్న తరుణంలో పదేళ్ళకోసారి జరిగే భారత జనగణన మొదటిదశ రాష్ట్రంలో ముగిసింది. రాష్ట్ర జనాభా సుమారు 9 కోట్లుగా ఈ గణనలో తేలింది. ఇందులో ఎన్నో ఆసక్తికర అంశాలు వెలుగుచూడడం ఈసారి విశ్లేషకులనే ఆశ్చర్యంలో ముంచెత్తింది.

ప్రాచీనకాలం నుంచి ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు చిహ్నంగా ఉన్న భారత కుటుంబ వ్యవస్థ వివిధ కారణాలతో చిన్న కుటుంబానికే ప్రాధాన్యమిస్తున్నట్టు ఈ సర్వే తెలిపింది. గత పదేళ్లలో రాష్ట్రంలో 25 లక్షల కుటుంబాలు పెరుగుతాయని కేంద్రం అంచనా వేసింది. కానీ ఈ అంచనాలను అధిగమిస్తూ 65 లక్షల చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయని సర్వేలో తేలింది. దీనికి కారణం జనాభా పెరగడం మాత్రమే కాదు. నిజం చెప్పాలంటే పెరిగిన జనాభాను మించి, చిన్న కుటుంబాలు పెరిగాయి. అంటే కుటుంబ సగటు జనాభా తగ్గింది. ప్రతీ కుటుంబంలోనూ సగటు సభ్యుల సంఖ్య నాలుగే. పట్టణాల్లో ఇది మరింత తక్కువ. దీన్ని ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నానికి చిహ్నంగా చెప్పవచ్చు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం వలసలు పెరగడం, జీవన వ్యయాలు పెరగడంతో ప్రజలు చిన్న కుటుంబాల వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. దీంతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ రాష్ట్రంలో కనుమరుగవుతోంది.

వివిధ కారణాలతో ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారడం నేటి సమాజంలో సహజమైపోయింది. ప్రతి కుటుంబంలోనూ భర్యాభర్తలతో పాటు ఒకరో, ఇద్దరో పిల్లలు మాత్రమే ఉంటున్నారు. మేమిద్దరం - మాకిద్దరు అనే సూత్రం భారత్ లో ఉండేది. ఇప్పుడు మేమిద్దరం - మాకొకరు అనే విధానం పెరిగిపోయిందని సర్వేలో తేలింది. జనాభా నియంత్రణకు ఇది చైనా అనుసరించిన విధానం. కానీ ఇప్పుడు ప్రచారం లేకుండానే చైన విధానాన్ని మనవారూ అనుసరిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. దీనికి కారణం జీవన వ్యయం పెరగడంతో పాటు పిల్లలు తక్కువమందైనా మంచి భవిష్యత్ ను అందించాలని తల్లిదండ్రులు కోరుకోవడమేనని నిపుణులు చెబుతున్నారు.

దేశంలో జనాభా పెరుగుదల రేటుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ లో తక్కువగా ఉందని 2009 చివర్లో జరిపిన ఓ సర్వే తెలిపింది. దీనిప్రకారం జాతీయ సగటు 22.8 శాతం ఉండగా, మన రాష్ట్రంలో 18.4 శాతం ఉంది. రాష్ట్రంలో జనాభా పెరుగుదల దేశంలో 15 రాష్ట్రాల కంటే తక్కువగా ఉందని తెలిపింది. దీన్ని పరిశీలిస్తే చిన్న కుటుంబాలకే మనవాళ్లు మొగ్గు చూపుతున్నట్టు భావించవచ్చు. నగరాలు, పట్టణాల్లో అయితే పెరిగిన జీవన వ్యయం కారణంగా చిన్న కుటుంబాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయని జనగణన తెలిపింది.

పదేళ్లకోసారి జరిగే జనగణనలో మొదటిదశ ఏప్రిల్ 26 నుంచి జూన్ 10 వరకూ జరిగింది. ఇందులో సేకరించిన అన్ని వివరాలను క్రోడీకరించి జిల్లాల నుంచి రాష్ట్ర జనగణన కార్యాలయానికి తరువాత వాటిని కేంద్రానికి పంపుతారు. రాష్ట్రాల్లో జనగణనను పూర్తిచేయడానికి కేంద్రం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ రెండోవారం వరకూ గడువిచ్చింది. మన రాష్ట్రంలో వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించడంతో ముగిసింది. కానీ కొన్ని రాష్ట్రాల్లో ఇంకా పూర్తికాలేదు. అన్ని రాష్ట్రాల నివేదికలు వచ్చిన తరువాత కేంద్రం 2011 జనాభా లెక్కలపై ప్రాథమిక నివేదికను విడుదల చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

రెండోదశ 2011 ఫిబ్రవరి 9 నుంచి నెలాఖరు వరకూ జరుగుతుందని అధికారులు తెలిపారు. మొదటి దశలో భాగంగా

**ప్రాథమిక అంచనాల ప్రకారం**

| 2001 | 2001 |
|---|---|
| రాష్ట్రజనాభా 7.62 కోట్లు | రాష్ట్ర జనాభా సుమారు 9 కోట్లు |
| రాష్ట్రంలో 1.7 కోట్ల కుటుంబాలు | రాష్ట్రంలో 2.35 కోట్ల కుటుంబాలు |
| రాష్ట్రంలో 4.48 సగటు కుటుంబ సభ్యులు | రాష్ట్రంలో 4.0 సగటు కుటుంబ సభ్యులు |
| హైదరాబాద్ జనాభా 38 లక్షలు | హైదరాబాద్ జనాభా 91 లక్షలు |
| 6.95 లక్షల కుటుంబాలు | 24 లక్షల కుటుంబాలు |
| కుటుంబ సభ్యుల సగటు 5.46 | కుటుంబ సభ్యుల సగటు 3.7 |

ఇళ్లు, కట్టడాలు, కుటుంబాల సంఖ్య, కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, జన్మస్థలం, కుటుంబ యజమానితో గల సంబంధం వంటి ప్రాథమిక వివరాలను మాత్రమే సేకరించారు. మొదటిసారి వెళ్లినపుడు తాళం వేసి ఉన్న ఇళ్లకు రెండోసారి కూడా వెళ్లామని, అయినా కొన్ని ఇళ్ల సమాచారం లభించలేదని... ఈ సమాచారాన్ని రెండోదశ గణనలో సేకరిస్తామని అధికారులు వివరించారు. జనగణనలో తమ పేర్లు నమోదు కాని వారు వివరాలను సంబంధిత మండల తహశీల్దారు, మున్సిపల్ కమిషనర్లకు అందించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఏ ఏరియాలో నైనా జనగణనకు ఎన్యూమరేటర్లు రాకపోతే టోల్‌ఫ్రీ నెంబర్ 1800 3450 111 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

రెండోదశ సేకరణలో భాగంగా ప్రతీ పౌరుడి వ్యక్తిగత వివరాలతో పాటు జైళ్లు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలులలో నివసించే వారి వివరాలను కూడా సేకరిస్తారు. ఫిబ్రవరి 28 అర్ధరాత్రి వరకూ రోడ్లపై పడుకున్న వారి వివరాలు, ఇళ్లు లేని వారి వివరాలు కూడా సేకరిస్తారు. దీంతో పదేళ్లకోసారి జరిగే బృహత్తర ఉద్యమం పూర్తవుతుంది. ఈ జనాభా లెక్కలు పేదరికాన్ని గుర్తించడంతో పాటు, పలురకాలుగా ఉపయోగపడతాయని పౌరులందరూ సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తుంది.

# "సీఆర్‌పీసీ 43కింద ప్రజలే బెల్టుషాపుల నిర్వాహకుల్ని అరెస్టు చేయవచ్చు...

- **మద్యనియంత్రణ ఉద్యమంలోని తమ నేతలపై లిక్కర్ లాబీ దౌర్జన్యాన్ని ఖండించిన లోక్‌సత్తా**
- **ప్రభుత్వమే అసలు దోషి అని స్పష్టీకరణ**
- **"ముందుకు రావాలని" పిలుపు**

'చట్టవిరుద్ధమైన' మద్యం దుకాణాల సిట్టింగ్ రూంల, బెల్టుషాపుల నిర్వాహకుల్ని 'చట్టబద్ధంగా' ప్రజా అరెస్టు చేస్తున్న లోక్‌సత్తా నాయకుల్ని పోలీసులు అరెస్టు చేయటాన్ని, అక్రమ దుకాణాల్ని మూయిస్తున్న నేతలపై మద్యం నిర్వాహకులు భౌతికదాడికి దిగటాన్ని లోక్‌సత్తా తీవ్రంగా ఖండిస్తోంది. సర్కారీ దన్నుతో రాష్ట్రంలో మద్యం లాబీ ప్రభావం ఎంత దారుణంగా వేళ్లూనుకుందో ఈ ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. జూలై 8న "ఒంగోలు పట్టణంలో ఒక వైన్‌షాప్‌లో అక్రమంగా సిట్టింగ్ రూం నిర్వహిస్తూ, లూజు మద్యం బాటిళ్లను అమ్ముతున్నవారిని ప్రజాఅరెస్టు చేస్తున్న లోక్‌సత్తా నేతల్ని పోలీసులు అరెస్టు చేశారు. జూలై9న గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం వెన్నాదేవి గ్రామంలో బెల్టుషాపుల్ని మూసివేయిస్తున్న లోక్‌సత్తా అనుబంధ మహిళాసత్తా నరసరావుపేట అధ్యక్షురాలు జి. నిర్మలాబోస్‌పై బెల్టు నిర్వాహకులు భౌతికదాడి చేయటంతోపాటు ఎదురు కేసులు పెట్టేందుకు ప్రయత్నించారు. మద్యాన్ని ఆదాయమార్గం చేసుకుని సమాజహితాన్ని, ప్రజల హక్కుల్ని కాలరాసేలా రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తుండటం వల్లే ఈ బరితెగించిన ఘటనలు జరిగాయి".

"లైసెన్సు లేకుండా బెల్టుషాపుల్లో మద్యం అమ్మటం, సిట్టింగ్ రూంలు నిర్వహించటం నాన్‌బెయిలబుల్, శిక్షార్హమైన నేరం. అలాంటి నేరాలను నివారించే, నిరోధించే బాధ్యత, అధికారం ప్రజలకు ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) సెక్షన్ 43 ప్రకారం అలాంటి సందర్భాలలో నేరస్తులను 'ప్రజా అరెస్టు' చేసి పోలీసులకు లేదా స్థానిక మేజిస్ట్రేట్‌కు అప్పగించాలి. లోక్‌సత్తా చేస్తున్న ప్రజా అరెస్టులు పూర్తి చట్టబద్ధమైన కార్యక్రమం".

రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగంతోపాటు సిండికేట్లుగా మారిన రాజకీయ పార్టీల నేతలు ఒక లాబీ కింద మారి మద్యం వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వారు చేస్తున్న అక్రమ వ్యాపారంపై పూర్తి చట్టబద్ధంగా లోక్‌సత్తా పోరాడుతుంటే పోలీసులు పూర్తిగా సహకరించాలి. సిట్టింగ్ రూంలపై, బెల్టుషాపులపై దాడులు నిర్వహించాల్సిన ఎక్సైజ్ శాఖ మద్యం లాబీతో కుమ్మక్కయి మౌనం పాటిస్తోంది. చట్టబద్ధంగా వాటిని మూయిస్తున్నవారిపై పోలీసుల జులుం చేస్తుంటే వారు కూడా మద్యం లాబీతో కుమ్మక్కయినట్టు భావించాల్సి ఉంటుంది.

లోక్‌సత్తా ఈనెల 22 వరకూ 16 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో నిర్వహిస్తూ మద్యనియంత్రణ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాలీ, ప్రదర్శనలు వంటి కార్యక్రమాల్లో ప్రజల్ని చైతన్యవంతం చేస్తోంది. ఈ కృషిని ప్రతి గ్రామంలోకీ విస్తరించేందుకు వీలుగా మహిళలు, యువత పెద్దఎత్తున కలిసిరావాలి. బెల్టుషాపులను చట్టబద్ధమైన ప్రజాఅరెస్టులతో, శాంతియుతంగా మూసివేయించేందుకు ప్రజలు ముందుకురావాలి. ◆

# మంచి విద్య మన ప్రాథమిక హక్కు

- మహాలక్ష్మి



సరస్వతీ నమస్తుభ్యం! బదులుగా ఇప్పుడు క్షమయా సరస్వతీ అని చెప్పుకోవలసివస్తోంది. రాజుగారికి తాను కవిత్వాన్ని అమ్మబోతానేమో అన్న భయంతో సరస్వతీదేవి కన్నీరు కారుస్తూ తనను రాజుకు అమ్మవద్దని అడిగినట్లుగా పోతనామాత్యుడు భావించాడు, బాధపడ్డాడు. అమ్మబోవటం లేదని చెప్పుకున్నాడు అది ఆనాడు. మరి ఈనాడు చదువుల తల్లి అమ్మకానికి తప్ప దొరకని పరిస్థితి నెలకొని ఉంది. వైద్య,విద్యారంగాలు ప్రభుత్వ అధీనంలో నుండి ప్రైవేటుపరమై మూడు దశాబ్దాలు కావస్తోంది. ఈ మూడు దశాబ్దాల కాలంలో విద్యారంగం ప్రైవేటు రాబందుల రెక్కల్లో చిక్కి విలవిలలాడుతోందని చెప్పకతప్పదు.

ఎలిమెంటరీ విధానం చూస్తే పుస్తకాలు పిల్లల పాలిట గుదిబండలుగా మారాయి. వారి బాల్యం బరువు మోయటానికో, చదువులు నేర్వటానికో అర్దంకాని పరిస్థితి. ఏదైనా అందమైన బాల్యం కాన్వెంట్ చదువుల కోరలలో చిక్కి బంగారు బాల్యాన్ని అనుభవించలేని పరిస్థితి ఏర్పడింది. పిల్లలతోపాటు తల్లిదండ్రులు ఆపసోపాలు పడుతూ, కాన్వెంటుల వెంట పరుగెడుతూ వారి డిమాండ్లకు తలొగ్గుతూ వారి విద్యావ్యాపారాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నారే గాని, విద్యావ్యవస్థ మెరుగుకై ప్రభుత్వాన్ని డిమాండు చేయాలని గాని, మంచి విద్య వారి హక్కు అని గాని గుర్తెరగని పరిస్థితి నెలకొని ఉంది. స్కూలు డ్రెస్, టై, బూట్లు, క్యారేజీలు, వాటర్ బాటిళ్ళు, పుస్తకాలు ఆఖరికి పుస్తకాల అట్టలు కూడా ఆయా స్కూళ్ళలోనే కొనాలనే నిబంధనలు ఆ స్కూలు యాజమాన్యాల వ్యాపార సరళికి నిదర్శనాలు. అలాగని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించటానికి ప్రభుత్వ విద్యావ్యవస్థలో నాణ్యత లోపించింది. ప్రభుత్వ పాఠశాలలకు పంపలేక, కాన్వెంటుభారం భరించలేక తల్లిదండ్రులు నలిగిపోతున్నారనటంలో అతిశయోక్తి లేదు కాబట్టి ప్రభుత్వం సత్వరం స్పందించి ఎలిమెంటరీ విద్యావ్యవస్థను తగినరీతిలో సంస్కరించి విద్యార్థులకు మంచి విద్య అందించే బాధ్యతను చేపట్టాలి.

ప్రభుత్వ పాఠశాలలో 40,000 టీచరుపోస్టులు ఖాళీ ఉన్నాయని అంచనా. అదికాక కొత్త విద్యావిధానం వలన మరో 20,000 వేల పోస్టులు పెరుగుతాయి అని చెపుతున్నారు. ఈ ఖాళీలలో సత్వరం ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన మెరుగుపరచవలసిన అవసరం ఉంది. అదలా ఉండగా పాఠ్యపుస్తకాల పంపిణీ ఇంకా మొదలుకాకపోవటం ప్రభుత్వం నత్తనడకకు నిదర్శనం. ఇలాంటి విద్యావ్యవస్థ ఎప్పుడు బాగుపడాలి. అంతేకాదు ప్రభుత్వ పాఠశాలలు అవసరానికి సరిపడా ఉన్నాయా? ఉన్నవి ఏ రీతిలో ఉన్నాయి. ఉన్న వాటి నాణ్యత ఎంత అని ఆరాతీస్తే నిరాశే మిగులుతుంది. పొట్లపందిరిలాంటి పాఠశాలలు కొన్ని అయితే, చెట్లకిందే కొన్ని పాఠశాలలు నడుస్తున్నాయి. ఈ విధంగా ఉన్న విద్యావ్యవస్థను తోవలో పెట్టకుండా ఎంతమంది ఉపాధ్యాయులను నియమించినా ప్రయోజనం ఏమీ ఉండదు. అంతేకాక ఇలాంటి విషయాలను పర్యవేక్షించి ప్రభుత్వానికి రికమెండ్ చేయటానికి ఆంధ్రప్రదేశ్‌లోని సగానికిపైగా జిల్లాల విద్యాధికారులు (డి.ఇ.ఒ.)లు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష ధోరణికి దర్పణం పడుతోందని చెప్పాలి.

ప్రభుత్వ మాధ్యమిక సెకండరీ విద్యావిధానం ఇందుకేమి భిన్నం కాదు. అయితే ఇటువంటి పరిస్థితులలో కూడా 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను గమనిస్తే ప్రైవేటురంగంలో చదువుతున్న విద్యార్థులకు తీసిపోకుండా మార్కులు సాధించటం హర్షణీయం. ఈ విషయాన్ని నిశితంగా గమనించినపుడు అరకొర సౌకర్యాలు ఉన్న పరిస్థితులలో కూడా విద్యాకుసుమాలు సుగంధాలను వెదజల్లుతున్నాయని గర్వించవచ్చు. ఇలాంటి పరిస్థితిని ప్రభుత్వం గమనించి పల్లెల్లో, పట్టణాలలో కూడా విద్యార్థులకు సరైన వసతులు కల్పించినపుడు ఫలితాలు మరింత మెరుగవుతాయనేది స్పష్టం.

పాఠశాలలో బెంచీలు బ్లాక్‌బోర్డులు లేకపోవడం ఒకటయితే అసలు పాఠశాల భవనాలలో క్లాసురూములు తరగతులు

నిర్వహించటానికి అనుకూలంగా లేకపోవడం ఇంకొకటి. ఆడపిల్లలకు టాయ్‌లెట్ సౌకర్యాలు లేక పాఠశాలలకు వారి పెద్దలు పంపటం లేదు అనేది చాలా చోట్ల జరుగుతోంది. ఇది ఎంత శోచనీయ పరిస్థితి! ఇటువంటి పరిస్థితులను గమనించి వెంటనే తగినరీతిలో పక్కా ఏర్పాట్లు చేయకపోయినట్లయితే ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని పోగొట్టుకుంటాయి అనేది సత్యం. అంతే కాదు బడికి పంపిన పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపే శక్తి లేనపుడు, ఆర్థిక భారాన్ని తగ్గించుకోవటానికి పనులకు పంపటానికి ప్రయత్నిస్తారు. ఫలితంగా బాలకార్మిక వ్యవస్థ మరింత బిగిసుకుంటుంది. తద్వారా భావిభారత పౌరులు నిరాశానిస్పృహలతో నిర్వీర్యులౌతారని చెప్పక తప్పదు. బాలల భవిష్యత్ పునాదులను పటిష్టపరచటానికి బాధ్యత ప్రభుత్వాలదేనని డిమాండ్ చేయకతప్పదు.

పథకాలలో కెల్ల గొప్ప పథకం మధ్యాహ్నభోజన పథకం. అధ్వాన్నస్థితిలో ఉందని చెప్పకతప్పదు. పథకాలు ప్రవేశపెట్టేటప్పటి మాటలు చేతలలో కొన్నాళ్ళే, మొన్నటిదాకా రోజూ కోడిగుడ్లు అంటూ చెప్పారు. ఆచరణలో డొల్లతనం స్పష్టమయింది. ఇప్పుడు మరల విద్యార్థులను ఆకర్షించటానికి వివిధ రుచులతో విందు ప్రచారం, అది ఎన్నాళ్ళానేది అందరికీ తెలుసు. ఎందుకీ రంగులవలలు మామూలుగా పిల్లలకు భోజన పథకాన్ని అమలుచేస్తూ చక్కని విద్య నేర్పించినప్పుడు పిల్లలు తప్పక బడిబాట పడతారనేది సుస్పష్టం.

*'విద్య మొసగు వినయంబు' అన్న పదానికి అర్థం లేకుండా పోయింది. ప్రైవేటు పాఠశాల గురించి చెప్పాలంటే ఎంతో ఉంది. ఈ చదువుల మాయలో ఒత్తిడిలో పడి మానవ సంబంధాలు కూడా మరుగున పడుతున్నాయంటే అతిశయోక్తికాదు. ఇకనుంచైన పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలైనా, ప్రైవేటు పాఠశాలలైన తగిన వనరులు, వసతులు, లేకుండా నడుపరాదని కఠిక నిబంధనలు ఉండాలి.*

'సర్వశిక్ష అభియాన్' గొప్పపథకం' గొప్పగా అవినీతిలో కూరుకుపోయింది. ఆర్భాటం ఎక్కువ, ఆచరణ తక్కువ, అవినీతి మక్కువ. ఈపథకంలో దాదాపు నాలుగువందల ఎనభైకోట్లు రూపాయులు అవినీతి జరిగిందని అంచనా. అవినీతికి పాల్పడినదెవరో రుజువైనా శిక్షించలేని ప్రభుత్వ యంత్రాంగం. ప్రక్షాళన కార్యక్రమం గుండుసున్నా ఎంత సిగ్గుచేటు! పైగా వారికి దన్నునిచ్చి కాపాడే మంత్రివర్యుల ఆగడాలు చూస్తే విద్యాప్రమాణాలు మెరుగవుతాయని నమ్మేదెట్లా?

**మీడియం :** ప్రైవేటు వ్యవస్థకు ధీటుగా ఇంగ్లీష్ మీడియంలో బోధన పథకం. 'వెనకటికొకాయన, గొప్పకోసం గోచితీసి తలపాగా చుట్టుకున్నాడట' ఆ విధంగా ఉన్న తెలుగు మీడియంకు సరియైన నిర్వహణ లేదు కాగా ఈ ఇంగ్లీష్ మీడియం పాట్లు చూద్దాం.

ప్రభుత్వ పాఠశాలలో తెలుగుమీడియంలో చెప్తారు. పెద్ద చదువులకు వచ్చినప్పుడు ఇంగ్లీష్ కష్టమౌతుంది అనే డిమాండ్ పట్టుకుని ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో 2008లో మొదలుపెట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల శక్తి సామర్థ్యాలు అంచనా వేయకుండా 6వ తరగతి నుండి సిబియస్ఇ లో ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర సిలబస్‌లోనే ఆంగ్ల బోధన జరగాలన్న డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోలేదు. అటు ఉపాధ్యాయులు కూడా సిబియస్ఇ సిలబస్‌లో పాఠాలు చెప్పలేకపోయారు. 5వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివి 6వ తరగతి నుండి ఆంగ్ల మాధ్యమంలో చేరిన విద్యార్థుల పరిస్థితి కూడా అంతే అయింది. చివరకు సమస్య గుర్తించి 2009 నుండి రాష్ట్ర సిలబస్‌లోనే బోధన జరపాలని సర్కారు వారు నిర్ణయించారు. ఎంపిక చేసిన 6500 పాఠశాలలో 2008సం॥లో ఆరవ తరగతిలో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. 1.35 లక్షల మంది విద్యార్థులు ఆంగ్లమాధ్యమాలలో చేరారు. పాఠశాల ఉన్న ప్రాంతాన్ని పట్టి విద్యార్థుల సంఖ్య 200 నుండి 1500 వందల వరకు ఉంది. మరి, వారికి, చెట్లు, వరండాలు, ఆఫీసుగదులే క్లాసు రూములుగా ఉన్నాయి. తరగతులు పెరిగే కొలది వారితో మరల చేరేవారికి సౌకర్యాలు ఏవి? ఎంత సిగ్గు పడవలసిన విషయమిది! ప్రభుత్వం మన విద్యార్థులకు కావలసిన మామూలు సౌకర్యాలు కూడా ఇవ్వలేని దయనీయస్థితిలో ఉందా? ఏమో! నమ్మశక్యంగా లేదు. ఇదంతా అవినీతి కుట్రకు అద్దం మాత్రమే! మనలను అడిగే వారెవ్వరనే ధీమా కాకమరేమిటి!

1960-65సం॥లో ప్రాథమ, మాధ్యమిక విద్యకు మన రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల బెడద లేదు. అన్నీ దాదాపుగా ప్రభుత్వ పాఠశాలలే కాగా మిషనరీ పాఠశాలలు మాత్రమే ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండేవి. అప్పటి విద్యా బోధన క్రమశిక్షణ, ఉపాధ్యాయులు నిబద్ధత అన్నీ కూడా మెరుగైన రీతిలో ఉండేవి. ప్రతి పాఠశాలకు లాబరేటరీ, ఆటస్థలం, ఆటలకు కావలసిన పరికరాలు ఆడించటాని పి.ఇ.టి. మాష్టర్లు ఎంతో చక్కని వ్యవస్థగా ఉండేది. అవన్నీ ఏమయ్యాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. అప్పట్లో మోరల్‌క్లాసులు వారంలో రెండైన ఉండేవి. ఇప్పుడా పరిస్థితిలేదు. మోరల్ క్లాసులూ లేవు సరికదా. విద్యార్థులకు ప్రైవేటు వ్యవస్థలో ఇరుకైన క్లాసురూములలో విద్యాబోధన జరుగుతోంది. ఇంగ్లీషులో అమెరికన్ యాసలో మాట్లాడటం మాత్రం నేర్చుకుంటున్నారు గాని ప్రాపంచిక పరిస్థితుల పట్ల అవగాహన, కుటుంబవ్యవస్థ పట్ల గౌరవం నైతిక విలువలు నేర్పటం లేదు. పోటీ మనస్తత్వం పెరిగిపోతోంది. లేచిన దగ్గర నుండి నిద్రపోయేవరకు చదువు కోసం ఒత్తిడిలోకి నెట్టబడుతూ బాల్యాన్ని కూడా పూర్తిగా అనుభవించ లేకపోతున్నారంటే అతిశయోక్తికాదు.

'విద్య మొసగు వినయంబు' అన్న పదానికి అర్థం లేకుండా పోయింది. ప్రైవేటు పాఠశాల గురించి చెప్పాలంటే ఎంతో ఉంది. ఈ చదువుల మాయలో ఒత్తిడిలో పడి మానవ సంబంధాలు కూడా మరుగున పడుతున్నాయంటే అతిశయోక్తికాదు. ఇకనుంచైన పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలైనా, ప్రైవేటు పాఠశాలలైన తగిన వనరులు, వసతులు, లేకుండా నడుపరాదని కఠిక నిబంధనలు ఉండాలి. విద్యతో పాటు పిల్లలు సామాజిక స్పృహకూడా అలవరచుకోవాలి. భారతజాతి ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి. విద్యా కుసుమాలుగా విరబూయాలి. దేశ భవిష్యత్తును స్వర్ణమయంచేయాలి. దానికి ప్రభుత్వాలు కృషి చేయాలి.

హాస్టళ్ళ విషయానికి వస్తే పేదవర్గాలకు రిజర్వేషన్ సౌకర్యంతో వసతిగృహాలు ఏర్పాటు చేసి, తద్వారా విద్యను ప్రోత్సహించాలని నిర్ణయించారు. అవికూడా అంతంతమాత్రంగానే నడుస్తున్నాయి. అరకొర సౌకర్యాలు, వార్డెన్ల అవినీతి, రాక్షసత్వం, పిల్లలను భయభ్రాంతులను చేస్తున్నాయని చెప్పాలి. కడుపు నిండా భోజనం, పడుకోవటానికి కనీసం ఒక దుప్పటి కూడా లేని హాస్టళ్ళెన్నో ఉన్నాయి. ఈ విధమయిన పరిస్థితులలో ఉండి వారేమి చదువు నేర్చుకుంటారు. సమాజానికి ఎలాఉపయోగపడతారు. లేదు సరికద సమాజానికి సవాళ్ళవుతారని నిస్సంకోచంగా చెప్పవచ్చు.ఇక ఉత్తరాంధ్రలో ఇంకా నిరక్షరాస్యత తీవ్రంగా ఉందని చెప్పటానికి సిగ్గుపడవలసిన విషయం.

కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టటానికి ఈ సంవత్సరం ప్రభుత్వం ముందుకు వస్తోంది. ఆ నిధులు సక్రమంగా వినియోగించుకునే దిశగా ప్రజానాయకులు శ్రద్ధతీసుకోవాలి. వారి వారి జిల్లాలలో, పంచాయితీలలో పాఠశాలలు లేని వారు పాఠశాల బిల్డింగులు ఉన్నవారు మిగతా సౌకర్యాలు ఏర్పాటుకై కృషిచేసి సాధించుకోవాలి. లేదంటే రాబోయే నిధులు దారి మళ్ళి దుర్వినియోగ మవుతాయనేది నిజం.

పూర్వం కన్న ఇప్పుడు చదువుల విలువలు తెలుసుకొని తల్లిదండ్రులు వారి అవసరాలు కూడా మానుకొని పిల్లలను చదివించుకోవటాని సిద్ధపడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వ స్పందించి అందరికి విద్యను అది నాణ్యమైన విద్యను, పరిసరాలు సమకూర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి తరగతికి తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలి. బోధన పరికరాలు, సైన్స్‌లాబ్‌లు ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించాలి. మరుగుదొడ్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు తప్పని సరిచెయ్యాలి. ఆట స్థలం తగినంతగా లేకుండా పాఠశాలలు అనుమంతించరాదు. అప్పుడే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది అనటంలో సందేహంలేదు.

టీచర్ల విషయానికి వస్తే బతకలేక బడి పంతులు అన్న రోజులు పోయి ఉపాధ్యాయులకు మంచి జీతాలు ఏర్పాటు చేసినా, తగినంత మంది ఉపాధ్యాయులు లేక పోవటంతో చదువు సాగటం లేదు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టిపెట్టి ఉపాధ్యాయుల నియామకాలను వెంటనే అమలు పరచాలి.వీరిని బోధనేతర బాధ్యతల నుండి దూరంగా ఉంచటం మంచిది. విద్య, ప్రైవేటు పరంగా వేళ్ళూనుకుని ఉన్నప్పటికి మంచి ట్రైన్డ్ టీచర్లు ప్రభుత్వ పాఠశాలలోనో ఉన్నారన్నది సత్యం. వీరి మేధాసంపత్తిని సక్రమంగా వినియోగించుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పక తప్పదు. డి.ఇ.ఓ.లు లేని జిల్లాలలో తక్షణం ఆయాపోస్టులను భర్తీచేసి పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చెపట్టాలి.

వృత్తి విద్యా కోర్సులు ఇప్పటికీ ప్రభుత్వ హయాంలోనే ఎక్కువగాను సమర్ధవంతంగాను, ఉండటం ఆనందదాయకం. అయితే అన్ని రంగాల పరంగాను ఈ కాలేజీలు మరింతగా విస్తరింపజేయవలసిన అవసరం ఉంది. మనదేశంలో, ప్రత్యేకించి, మనరాష్ట్రంలో మేధావులైన విద్యార్థులు అన్ని రంగాలలో కూడా కొదవేలేదని మొన్నటి ఫలితాలు చెపుతున్నాయి. మేధావులైన విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సహకాలు అందించి మరింతగా ఉత్సహపరచవలసిన బాధ్యత ప్రభుత్వానిది. విదేశాలకు వేళ్ళే మేధావులను ప్రోత్సహించి నప్పటికి వారిమేధా సంపత్తిని మనదేశానికి ఉపయోగపడే విధంగా ప్రయత్నాలు చేయటం తప్పనిసరి అని నేను నమ్ముతున్నాను. మన దేశానికి ఈనాడు మేధా సంపత్తి ఎంతో అవసరం. ఆ విషయాన్ని ప్రభుత్వం సత్వరం గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రైవేటు స్కూళ్ళకు దీటుగా చెప్పాలంటే ఇంకా నాణ్యతతో కూడిన విద్యా విధానాన్ని జాతి శ్రేయస్సు కోసం ఆలోచించి ప్రభుత్వాలు ప్రవేశపెట్టాలి. అటువంటి విద్యావిధానాలు అమలు చేసిన పక్షంలో మన స్వతంత్ర భారతావనిలో పిల్లలు స్వాతంత్ర్య ఫలాలను ఆనందంగా ఆస్వాదించగలరని ఆశించవచ్చు.

**మంచివిద్య, మంచి ఆరోగ్యం, జాతికి గర్వకారణం.** ◆

## ప్రాంతీయ స్థాయి శిక్షణా కార్యక్రమం




**తిరుపతి పట్టణంలో ప్రాంతీయ మున్సిపల్ ఎన్నికల శిక్షకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ వేంరెడ్డి విజయేందర్ రెడ్డి**

# కార్యకర్త జెండా–ఎజెండా

- కొంగర గంగాధర రావు

అందరికీ విద్య, ఉచితంగా వైద్యం, యువతకు నైపుణ్యం–ఉపాధి, వ్యవ'సాయం', కఠిన మద్య నియంత్రణ, సమసత్వర న్యాయం, అవినీతి అంతం, సామాజిక భద్రత, కులనిర్మూలన, పౌరుడు కేంద్రంగా పాలన, ప్రాంతీయ అసమానతలను రూపుమాపటం. ఇవి స్థూలంగా లోక్‌సత్తా పార్టీ ప్రధాన లక్ష్యాలు.

లక్ష్యాలు అనటం కంటే ఇవి ప్రతి లోక్‌సత్తా పార్టీ కార్యకర్తకు దిక్సూచికలు. పార్టీ కార్యక్రమాల రూపకల్పనలో ఈ సూచికలు కార్యకర్తలను ప్రభావితం చేస్తాయి. దిశానిర్దేశం చేస్తాయి. ప్రతి కార్యకర్త లోక్‌సత్తా పార్టీకి ఒక సృజనశీలిగా పని చేయాలి. తనలోని ఆలోచనా పటిమను తన చుట్టూవున్న సమాజంలోని సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలి. అందుకు లోక్‌సత్తా పార్టీ భావజాలం దారి చూపుతుంది.

పార్టీ జెండాలోని **ముదురు నీలం రంగు** అన్ని ప్రవాహాలను తనలో కలుపుకునే మహాసాగర స్వభావానికి, విస్తృతికి, లోతుకు ప్రతీక. పార్టీ మహా సాగరమైతే ప్రతి కార్యకర్త పిల్లనది, ఉపనది. పిల్లనది లేనిదే నదిలేదు, నదిలేనిదే సాగరం లేదు. కార్యకర్త సృజనాత్మకత పార్టీకి వైవిధ్యాన్ని ఇస్తుంది. మూసధోరణిలో పోయే పార్టీ నాయకత్వానికి ప్రకృతి పచ్చదనపు శ్వాసనిస్తుంది. ఆ శ్వాస పార్టీకి సరికొత్త దిశా నిర్దేశం చేస్తుంది. ఆ శ్వాస ఆగిన నాడు పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది.

పార్టీ జెండాలోని నక్షత్రంలోని ఐదు కోణాలకు ప్రతీకలు ప్రజాస్వామ్యానికి మూలస్థంభాలైన స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌర సాధికారత,చట్టబద్ధ పాలన, స్వయం దిద్దుబాటు. వీటికి ప్రతిరూపంగా కార్యకర్త తనను తాను తీర్చి దిద్దుకోవాలి. ఆలోచనలో **స్వేచ్ఛ** కార్యకర్తకు ఉత్సాహాన్నిస్తుంది. ఆచరణలో స్వేచ్ఛ కార్యకర్తకు ఉత్తేజాన్నిస్తుంది. ఆ కార్యకర్తకు లభించే గుర్తింపు అతనికి ఉత్ప్రేరకంగా పని చేస్తుంది. వెరసి పార్టీ ఎప్పుడు కొత్తదనంతో సరికొత్త మార్గాలలో పయనిస్తుంది. **స్వపరిపాలన** కార్యకర్తను బాధ్యతాయుతంగా చేస్తుంది. తనను తాను నియంత్రించుకునే తత్త్వం అలవడుతుంది. ఇతరుల స్వేచ్ఛకు భంగం కాని విధంగా తన ప్రవర్తనను, ఆలోచనా ధోరణిని మలుస్తుంది. నిర్ణయాలు తీసుకోవడంలో వున్న స్వతంత్రత కార్యకర్తను కార్యోన్ముఖుణ్ణి చేస్తుంది. పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తుంది. **పౌర సాధికారత** కార్యకర్తను తన చుట్టూ వున్న సమస్యల పట్ల స్పందించేలా చేస్తుంది. సమస్యలకు పరిష్కారాన్ని వెదుకుతుంది. పరిష్కారాలపట్ల పోరాటానికి సిద్ధం చేస్తుంది. అవసరాలను సాధించే ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేస్తుంది. **చట్టబద్ధపాలన** కార్యకర్త ప్రవర్తనను నియంత్రిస్తుంది. పార్టీ నియమావళికి బద్ధుణ్ణి చేస్తుంది. అవినీతి, అక్రమాలకు అమడ దూరంలో వుంచుతుంది. భవిష్యత్తులో లోక్‌సత్తా ప్రభుత్వానికి ప్రతిరూపంగా కార్యకర్తను ప్రజలకు చూపుతుంది. **స్వయం దిద్దుబాటు** కార్యకర్తను అంతర్ముఖుణ్ణి చేస్తుంది. తప్పులను సరిదిద్దుకునేలా చేస్తుంది. కాలానుగుణమైన మార్పులకు అనుగుణంగా తన కార్యాచరణను తీర్చిదిద్దుతుంది. ఇక నక్షత్రం.

సుదూర తీరాన వుండే **నక్షత్రం** పార్టీ సుదూర లక్ష్యాలను తెలుపుతుంది. ప్రతినిత్యం ఎదురయ్యే ఒడిదుడుకుల అలజడిలో లోక్‌సత్తా తన మార్గాన్ని కోల్పోదు. నక్షత్రంలా సుదూర లక్ష్యాల కాంతులే లోక్‌సత్తా గమనాన్ని నిర్దేశిస్తాయి.

లోక్‌సత్తా పార్టీ లక్ష్యం అధికారం కాదు. అధికారం ఒక మజిలీ మాత్రమే. ఆ తరువాత చేసేదే అసలు ప్రయాణం. ఆ ప్రయాణం దారి తప్పకుండా లక్ష్యం వైపు సాగాలంటే ప్రతి కార్యకర్తకు ఈ లక్ష్యంపై స్పష్టత వుండాలి. అధికారమనే మజిలీని చేరుకుంటే తప్ప ఈ లక్ష్య సాధన దిశగా ప్రయాణించలేం. అలాగని ఈ మజిలీని చేరుకోవడానికి అడ్డదారులు తొక్కితే అది ఆ తరువాత ప్రయాణానికి దాటలేని అడ్డంకిగా మారుతుంది.

సమాజంలో డబ్బు, అధికారం హోదా– వీటి కుండే విలువ దేనికీ లేదు. మిగిలిన పార్టీల నాయకులకు లక్ష్యం అధికారం మాత్రమే. దాని ద్వారా వచ్చే అవినీతి డబ్బు, అధికారం హోదా మిగతా పార్టీలను అడ్డదారులు తొక్కిస్తాయి. వీరితో పోలికలో న్యూనత భావానికి గురికాకుండా వుండాలంటే లోక్‌సత్తా పార్టీ కార్యకర్తకు వుండ వలసింది మనోబలం. తన లక్ష్యం పట్ల అచంచల విశ్వాసం.

పార్టీ జెండాలోని **తెల్లని వృత్తం** స్వచ్ఛతకు ప్రతీక. ప్రతి కార్యకర్త మతం, ప్రాంతం, కులం, భాష, విశ్వాసాల భిన్నత్వంలోని ఏకత్వానికి ప్రతీకగా వుండాలి. తన మన భేదం లేకుండా ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా తన నడవడికను తీర్చిదిద్దుకోవాలి. అందరి విశ్వాసాలను గౌరవిస్తూనే తన విశ్వాసాన్ని ప్రస్ఫుటించగలగాలి.

డబ్బు చేతికందితే తప్ప నాడి చూడని డాక్టర్‌కి, ఇవేమీ పట్టకుండా ముందు రోగి ప్రాణాలు కాపాడటమే విధిగా భావించే డాక్టర్‌కి వున్న తేడానే మిగతా పార్టీల నాయకులకు, లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలకు గల తేడా. ఎవరి గౌరవం వారిది. ఇద్దరినీ ఒకే కొలమానంతో కొలవలేం.

లోక్‌సత్తా పార్టీ జయాపజయాలను మిగిలిన పార్టీల కొలబద్దతో కొలవలేం. వారి ప్రయాణం వేరు. మన ప్రయాణం వేరు. లోక్‌సత్తా పార్టీ గమ్యం అసమానమైనది. ◆

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## విజయనగరం జిల్లా

### విద్యుత్ కోతపై సంతకాల సేకరణ

**విజయనగరం (రూరల్) :** మండలంలోని పాత దుప్పాడ గ్రామంలో విద్యుత్ కోతలపై యువసత్తా సంతకాల సేకరణ చేపట్టింది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని సంతకాలు ద్వారా తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా యువసత్తా జిల్లా కార్యదర్శి దయానంద్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆరుగంటలు మాత్రమే కోత విధించాలన్న నిబంధనలున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల గడిచిన మూడు నెలల నుంచి రోజుకు 12 నుంచి 15 గంటల వరకు రాత్రనక, పగలనక విద్యుత్ కోతలు విధిస్తున్నారని దీనివల్ల గ్రామంలో చిన్న పిల్లలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులకు పట్టణానికి వెళ్ళే గ్రామస్తులు తిరిగి గ్రామానికి చేరుకునే సమయంలో కరెంటు కోత ఉండటం వల్ల విషసర్పాల బారిన పడుతున్నారని, అంతేగాకుండా రాత్రివేళల్లో అధిక సమయం విద్యుత్ కోత విధిస్తుండటం వల్ల గతవారం రోజులుగా గ్రామంలో దొంగతనాలతో బెంబేలెత్తు తున్నారని ఆయన అన్నారు. ఇంత సమయం విద్యుత్‌కోతలు విధిస్తున్నా బిల్లులు మోతలు మాత్రం తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. దీనిపై యువసత్తా సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందని సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని ఎలక్ట్రికల్ డి.ఇ.ఇ.కి సమర్పించడం జరిగిందని తెలియజేశారు. వీలైనంత త్వరలో విచారణ జరిపించి సమస్యను పరిష్కరిస్తానని ఎలక్ట్రికల్ డి.ఇ.ఇ. హామీ ఇచ్చినట్లు దయానంద్ తెలిపారు. కార్యక్రమంలో యువసత్తా జిల్లా అధ్యక్షులు పాండ్రింకి వెంకటరమణ, యువసత్తా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సమాచారం లోపం వలనే ప్రజలు రాలేకపోతున్నారు
**లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరాజు**

**విజయనగరం, (రూరల్) :** బూత్ లెవిల్ అధికారులు పోలింగ్ బూత్‌లలో ఉంటున్నప్పటికీ ప్రజలకు తగిన సమాచారం లేనందువలనే ప్రజలు ఓట్ల నమోదుకు ముందుకు రాలేకపోతున్నారని లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు పాకలపాటి శ్రీనివాసరాజు అన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో స్థానిక 18వ వార్డు నందు బొబ్బదిపేట, సాలిపేట, ఉడాకాలనీ ప్రాంతాలలో ఓటరు నమోదు సహాయకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా వార్డులలో బూత్‌లెవెల్ అధికారులు పోలింగ్ బూత్‌లలో గతవారం రోజులుగా ఉంటున్నారన్నారు. అయినప్పటికీ ప్రజలకు తగిన సమాచారం లేనందున ప్రజలు ఓట్లు నమోదుకు ముందుకు రాలేకపోతున్నారని తెలిపారు. ఫలితంగా ప్రతిష్ఠాత్మకమైన ఈ కార్యక్రమం అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. పార్టీ పట్టణ శాఖ కార్యదర్శి కే డేనియల్ మాట్లాడుతూ, లోక్‌సత్తా పార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేసి ఓటు నమోదుకు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీ వెంకటరావు, అశ్విని కుమార్ మురళీ, మధన్ పాల్గొన్నారు.



### ప్రభుత్వ విద్యావిధానంలో మార్పు రావాలి
**లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ**

**విజయనగరం, (అర్బన్) :** విద్యార్థుల్లో దాగి ఉన్న సహజ ప్రతిభ బయటపడాలంటే ప్రభుత్వ విద్యా విధానంలో మార్పు రావాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలో మౌలిక సదుపాయాలు పెరగాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ ఏడాదిలో ప్రభుత్వ పాఠశాలలలో చదివి పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహకాలను అందించారు. లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేదలకు మంచి విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. యువసత్తా జిల్లా అధ్యక్షుడు పాండ్రంకి వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను యువసత్తా కార్యకర్తలు అభినందించడం జరుగుతుందన్నారు. అనంతరం యువసత్తా కార్యదర్శి కే. దయానంద్ విజేతల వివరాలను ప్రకటించారు. ఎద్దు సునీల్ – 577, గర్భాంనకు చెందిన కాగుపాటి కళ్యాణి 573, నెల్లిమర్లకు

చెందిన కలిశెట్టి కళ్యాణి, విజయనగరానికి చెందిన భరిడె పవన్‌కుమార్ - 563 అనంతపల్లి సుమన్ - 539, ఒబ్బిలిశెట్టి పద్మజ-528 ప్రోత్సాహకాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో తాడేలు వెంకటరావు యాదవ్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## వార్డు సమస్యలపై యువసత్తా ఇంటింటి సర్వే

**విజయనగరం:** పట్టణంలోని 24వ వార్డులోని మౌలికసదుపాయాలు, పారిశుద్ధ్యంపై యువసత్తా బృందం ఇంటింటి సర్వేను ప్రారంభించింది. తాము కట్టిన పన్నులకు తగిన సేవలు అందడం లేదని వార్డు ప్రజలు యువసత్తా సభ్యులకు వివరించారు. వార్డులో ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. పారిశుద్ధ్యం కార్మికులు కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వర్తించడం లేదని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా యువసత్తా జిల్లా అధ్యక్షుడు పి. వెంకటరమణ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ అస్థవ్యస్థంగా ఉందన్నారు. నెలకి రెండు లక్షల రూపాయలు పారిశుద్ధ్యానికే వెచ్చిస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ వార్డులో వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యువసత్తా జిల్లా కార్యదర్శి కె. దయానంద్, పట్టణ అధ్యక్షుడు పాకలపాటి శ్రీనివాసరాజు, భాస్కరుడు, కృష్ణ, డానియల్ పాల్గొన్నారు.

## అభియోగం లేకుండా బదిలీ చెయ్యడం రాజ్యాంగ విరుద్ధం

**విజయనగరం :** రాష్ట్రమంత్రుల అధికార దుర్వినియోగానికి అంతులేకుండా పోతుందని, జిల్లా అధికారులపై ఎటువంటి అభియోగాలు లేకుండా బదిలీలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో గడిచిన 6 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, జిల్లాస్థాయి బదిలీలు రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా జరిగాయన్నారు. ప్రజలకు సేవ చేద్దామనుకునే నీతి నిజాయితీ గల అధికారులకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. తనపని తాను నిజాయితీతో చేసుకుని పోతున్న అధికారులకు భద్రత కరువైందన్నారు. జిల్లాలో ఒక మంత్రి అత్యంత ఘోరంగా ప్రజాహితానికి వ్యతిరేకంగా, బజారుతాపీలా అధికారులను బెదిరిస్తున్నారని, అధికారులు పత్రికలకు ఎక్కడం విడ్డూరంగా ఉందన్నారు. బదిలీలలో జిల్లా స్థాయి అధికారులకే దిక్కులేకపోతే ఇక గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారుల వరకు నిజాయితీగా ఏం పని జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రులు అరాచకాల బదిలీలపై ఉద్యోగ సంఘాలు ప్రజాసంఘాలు, పెదవి విప్పకపోతే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తెలిపారు. వేటు వేసారని, ఇలా ఎంత మంది అధికారులతో మంత్రులు ఆట్లాడుకుంటారని ఆయన అన్నారు. జరుగుతున్న పరిణామాలపై లోక్‌సత్తా పార్టీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శివరామారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



## గాంధీ రాజ్యాన్ని బ్రాందీ రాజ్యంగా మార్చారు

**మద్యం టెండర్లపై లోక్‌సత్తా ధ్వజం**

**విజయనగరం:** గాంధీ వారసులుగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ రాష్ట్రాన్ని బ్రాందీ రాజ్యంగా మార్చిందని లోక్‌సత్తా పార్టీ ధ్వజమెత్తింది. రాష్ట్రంలో మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియను నిరసిస్తూ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా పేర్కొంటూ మద్యం వ్యాపారానికి తలుపులు బార్లా తెరిచారని ఆరోపించారు. సామాన్య, నిరుపేద జీవితాల్ని పీల్చిపిప్పిచేస్తూ, వారి కుటుంబాలను వీధినపడేస్తున్న మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ తీరును ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల కుటుంబాలు మద్యం వల్ల కునారిల్లుతున్నాయని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వ ఆదాయం కోసం మద్యం వ్యాపారాన్ని మాత్రం వదులుకునేందుకు సిద్ధంగా లేదన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు పి. శ్రీనివాసరాజు మాట్లాడుతూ నగరంలో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారని, అయితే మద్యానికి మాత్రం ఎక్కడా ఇబ్బందుల్లేవని అన్నారు. వాడవాడలా బెల్ట్ దుకాణాలను పెట్టిసైతం మద్యం అందుబాటులోకి తెస్తున్నారని, అబ్కారీశాఖకు టార్గెట్‌లు పెట్టి మరీ విక్రయాలను ప్రోత్సహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పట్టణ పార్టీ కార్యదర్శి డేనియల్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు మద్యం దుకాణాల వేలాన్ని అడ్డుకుంటామని ప్రకటించారు. మద్యం విధానాన్ని ఎదుర్కొనేందుకు అన్ని ప్రజాసంఘాలు తమతో కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహిళాసత్తా ప్రతినిధులు సుభద్రాదేవి, జిల్లా ప్రతినిధులు ఎం.ఎస్ఎన్.రాజు, కె. దయానంద్ పట్టణ పార్టీ ప్రతినిధులు కోటేశ్వరరావు, భాస్కరరావు, మురళి తదితరులున్నారు.

## మద్యం టెండర్లపై లోక్‌సత్తా ఆగ్రహం

**విజయనగరం :** మద్యం దుకాణాల టెండర్లను ఖరారు చేసేందుకు జిల్లా కలెక్టర్ రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన





కార్యక్రమాన్ని లోక్‌సత్తా పార్టీ ప్రతిఘటించింది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతగాని ముఖ్యమంత్రి మంత్రులపై ఆధారపడి వారు చెప్పిన విధంగా తలాడిస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్నారని ఆరోపించారు. ఆదాయం సమకూరడానికి అనేక మార్గాలుండగా మద్యానికి తలుపులు బార్లా తెరిచి సామాన్యుణ్ణి మరింతగా మద్యానికి బానిసను చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మంత్రులకు ప్రజల సమస్యలపై తీరిక లేక పనులున్నా వాటిని గాలి కొదిలి జిల్లాల్లో తన అనుచరగణానికి బంధువులకు మద్యం టెండర్లను కట్టబెట్టేందుకు వారి అధికారాన్ని ఉపయోగించుటకు జిల్లా కేంద్రాల్లో తిష్టవేశారని ఆరోపించారు. నిరుపేద జీవితాన్ని నాశనం చేస్తూ వారి కుటుంబాలను వీధిన పడేస్తున్న మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం తీరును ఆయన దుయ్యబట్టారు. దీని వల్ల రాష్ట్రంలో అనేక కుటుంబాలు అధోగతి పాలవుతాయని పేర్కొన్నారు. మహిళా సత్తా ప్రతినిధి సుభద్రాదేవి మాట్లాడుతూ మహిళా ఓట్లతో గెలిచిన ప్రభుత్వ మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించి మహిళలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఇకనైనా మహిళలు మేల్కొని ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. జోగిని నిర్మూలన వ్యతిరేక సంఘం తరపున మద్యం వ్యాపారాన్ని అడ్డుకుంటానన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన టెండరు ఖరారు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు వచ్చిన లోక్‌సత్తా పార్టీ నాయకులను కార్యకర్తలను పోలీసులు కార్యాలయం ముఖద్వారం అడ్డుకోగా ఇరువర్గాల మధ్య కొంత సేపు వాగ్వివాదం జరిగింది. దీంతో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కొంతసేపు బైఠాయించారు. నాయకులు హామీ మేరకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మరి కొంత మంది పార్టీ నాయకులను పోలీసులు కార్యాలయంలోకి అనుమతించారు. అనంతరం నాయకులు మద్యం వ్యాపారాన్ని నిషేదించాలని నినాదాలు చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పి. శ్రీనివాసరాజు, కార్యదర్శి డేనియల్, మహిళా సత్తా ప్రతినిధులు, జిల్లా ప్రతినధులు ఎం.ఎస్.ఎన్.రాజు, దయానంద్ పట్టణ పార్టీ ప్రతినిధులు కోటేశ్వరరావు, భాస్కరరావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా



## మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకము అవినీతిమయం నిలదీసిన లోక్‌సత్తా

**గూడూరు :** రాష్ట్ర వ్యాప్తంగా పై పథకం పూర్తిగా అవినీతిమయమై పోయింది. కోట్లాది ప్రజాధనం అధికార పార్టీ నాయకుల అనుచరులపాలైంది. కొన్ని గ్రామాల్లో ఉదా॥ నెర్నూరు, గొల్లపల్లి, గూడూరు రూరల్ మండలంలో ఇప్పటి వరకు ఇటువంటి పథకము ఒకటి అంటూ ఉంది అని ఆ గ్రామస్తులకు తెలియదు అంటే ఈ పథకాన్ని అమలు చేయడంలో అధికారుల చిత్తశుద్ధిని శంకించవలసివస్తుంది. ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలలో రామలింగాపురం గ్రామంలోని లోక్‌సత్తా మండల కన్వీనర్ లక్కు క్రిష్ణారెడ్డి, రంగారెడ్డి బాలక్రిష్ణ, మస్తాన్ రెడ్డిల చొరవతో పనులకు సంబంధించిన అవకతవకలు బయటపడ్డాయి. గ్రామంలోని 90% మందికి జాబ్‌కార్డులు, సేవింగ్ ఖాతాలు ఇప్పటి వరకు లేవు. యం.పి.డి.ఓ., టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డు అసిస్టెంట్ మరియు ఎ.పి.ఓ. కలసిపోయి సుమారు 4 లక్షల రూపాయల వరకు దుర్వినియోగానికి పాల్పడిన నిజాన్ని సామాజిక తనిఖీ సమీక్షా సమయంలో లోక్‌సత్తా డివిజన్ కన్వీనర్ కె.వి.కృష్ణయ్య జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు సర్పంచి మరియు గ్రామ అధికార పార్టీ నాయకులు అట్ల శ్రీనివాసులు రెడ్డి, నీలం సుబ్రహ్మణ్యం రెడ్డి, గూడిపాటి క్రిష్ణారెడ్డి, మల్లిఖార్జున్ రెడ్డి మొ॥లగు వారు చొక్కాపట్టుకుని ఈడ్చి దౌర్జన్యానికి దిగి కొట్టినంత పని చేశారు. జరుగుచున్న దౌర్జన్యాన్ని గమనించిన ఎ.పి.డి. వెంకటక్రిష్ణయ్య గారు స్పందించి రామలింగాపురం గ్రామం ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి నిరూపించబడినందున క్షేత్ర సహాయకుడు యన్.సుధాకర్ రెడ్డి గారిని విధుల నుండి తప్పించడం (సస్పెండ్) జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరి మోడుబోయిన సుబ్రహ్మణ్యం, ఇజ్రాయేల్ కుమార్, షబ్బీర్, వాసు యాదవ్, తిరుపతి, రమేష్‌కుమార్, బాలక్రిష్ణ, లక్కు క్రిష్ణారెడ్డి, మున్నా, ఖాదర్‌బాషా మొ॥గు వారు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం - ప్రస్తుతం దాని అవసరం

**గూడూరు:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు



పట్టణంలో గౌరవనీయులైన ఆచార్యఆదిత్య (ఆదిత్య విద్యాసంస్థల అధిపతి, నెల్లూరు) గారి ఆధ్వర్యంలో జరిగిన "సమాచార హక్కు చట్టం" దాని విశిష్టత, ప్రస్తుత సమాజంలో దాని అవసరం గురించి రాష్ట్ర సమాచార హక్కు సంస్థ కమీషనర్ ''దిలీప్ రెడ్డి'' సోదాహరణంగా వివరించడం జరిగింది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ చట్టం ఒక మైలురాయిలాంటిదని, పేద, బలహీన వర్గాల వారు ఈ చట్టం ద్వారా ప్రశ్నించే హక్కు పొందుతారని, తద్వారా, కనీస ఉపయోగాలు పొందగలరనే విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ప్రస్తుత సమాజంలో, అవినీతిని తుదముట్టించడం అనేదే ఏ ఒక్క పార్టీలో కాని, ఒక్క వ్యక్తి వల్ల గాని జరిగే పనికాదని, అందరం కలసికట్టుగా, చట్టాల ద్వారా ప్రజాపోరాటాల ద్వారా, విశ్వసనీయతతో పోరాటాలు చేయాలని, "సమాచార హక్కు సామాజిక పరిరక్షణ" సమితి గౌరవాధ్యక్షులు ఆచార్య ఆదిత్య గారు సభకు హాజరైన వక్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సునీత సేవా సంస్థ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, శ్రీలక్ష్మీ గార్లు సభా ఏర్పాటుకు తమ వంతు సహకారం అందించడమే కాక అందరు కూడా తమలాగే సమాజాన్ని గురించి ఆలోచించి రామరాజ్యం స్థాపించాలని కోరారు. లోక్‌సత్తా నాయకులు కె.వి.కృష్ణయ్య, టి.ఇజ్రాయేల్ కుమార్ గూడూరు పట్టణం, వెంకటేశ్వర్లు, వెంకటగిరి ఇన్‌ఛార్జ్ పవన్ మొ॥లగు వారు పాల్గొని సభని జయప్రదం చేశారు. రమేష్, వాసు యాదవ్, సుబ్రహ్మణ్యం, తిరుపతి, శేఖర్, దాసు, రామారావు, వీరయ్య మొ॥లగు వారు పాల్గొన్నారు.

## ముస్లీం మైనార్టీల సమస్యలపై లోక్‌సత్తా అభ్యర్థన

**గూడూరు :** గూడూరు పట్టణంలోని గాంధీనగర్‌లో 1981 సం॥లో అనగా సుమారు 30 సం॥ క్రితం పేద ముస్లీం మైనార్టీ వర్గాలకు 261 మందికి అప్పటి ప్రభుత్వం మనిషికి 18 అంకణముల చొప్పున ఇంటి స్థలం కేటాయించిన ప్రదేశం పూర్తిగా అడవి ప్రాంతం కావడంతో, విష సర్పాలకు భయపడి, అక్కడ ఇండ్లు నిర్మించుకోవడానికి మైనారిటీ ప్రజలు వెనుకడుగు వేశారు. అక్కడ మౌలిక వసతులు కల్పించమని, నాయకుల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతూనే ఉన్నారు. ఇంతలో ప్రభుత్వాలు



మారిపోయాయి. మారిన ప్రభుత్వంతో బాటుగా అధికారులు కూడా మారడం అనవాయితీ. క్రొత్తగా వచ్చిన ఆర్.డి.ఓ గారు కొంతమంది అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై 261 మందికి కేటాయించిన స్థలంలో 70 మంది తన కులస్థులకు అర్హతలు లేకున్నా, ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరిగింది. విషయం గ్రహించిన మైనార్టీ ప్రజలు మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సయ్యద్ మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో కోర్టులను ఆశ్రయించి లోకాయుక్త పరిధిలోకి పై విషయాన్ని పరిశీలనార్థం విన్నవించగా, వారు విచారించి మైనారిటీల ఇంటి స్థలాలను తిరిగి కేటాయించాలని, ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. కానీ జరిగిన తప్పును సరిదిద్దుకొనే క్రమంలో అధికారులు కేవలం 21 మందికి మాత్రమే తిరిగి వారి స్థలాలు కేటాయించడం జరిగింది. మిగిలిన స్థలాల కోసం ఇప్పటికి పేద మైనారిటీ ప్రజలు స్థానిక గూడూరు యం.ఆర్.ఓ. గారి చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పై విషయం గ్రహించిన లోక్‌సత్తా నాయకులు ముస్లీం మైనారిటీ ప్రజలకు న్యాయం చేయవలసినదిగా లోకాయుక్తని, జాయింట్ కలెక్టర్‌ని, యం.ఆర్.ఓ గారిని కోరగా దానికి స్పందించిన అధికారులు, విడతల వారీగా అందరికీ న్యాయం చేయగలమని, తొలివిడతగా 36 మందికి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయగలమని, లోక్‌సత్తా నాయకులు కె.వి.క్రిష్ణయ్య, ఇజ్రాయేల్ కుమార్, సుబ్రహ్మణ్యంలకు హామీ ఇవ్వడం జరిగింది. 36 మందికి పట్టాలు మంజూరుకు వారి దగ్గర ఉన్న పాత పట్టాలు, వారి గుర్తింపు కార్డులు తీసుకోవడం జరిగింది.



## దయచేసి మా భూములను మాకివ్వండి

**నెల్లూరు జిల్లా, గూడూరు :** ప్రభుత్వం భూమి పంపిణీ పేరుతో,

దళిత, బడుగు ప్రజల్ని మోసం చేస్తుంది. ఈ సారి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 5 విడతలుగా భూపంపిణీ కార్యక్రమం నిర్వహించింది. కొన్ని గ్రామాల్లో ఇచ్చిన భూమినే పదే పదే ఇస్తే మరికొన్ని గ్రామాల్లో అయితే ఇప్పటి వరకు పంచిన భూమికి హద్దులు చూపకుండా, లబ్ధిదారులను తమ చుట్టూ తిప్పుకుంటున్నారు. పి.యస్.ఆర్.నెల్లూరు జిల్లా రూరల్ మండలం, వెడిచర్ల రెవిన్యూ గ్రామంలో గోవిందు రమణయ్య, మాసారం గోపాల్, మాతంగి వెంకటయ్య మొదలగువారికి సర్వే నె. 137లో 1998లో మనిషికి య.1.50 ... చొప్పున మెట్టభూములు సాగుకు ఇవ్వడం జరిగింది. భూములైతే ఇచ్చినారు కానీ వాటిని సర్వే చేయించి భిన్నాలు ఏర్పాటు చేసి, సబ్‌డివిజన్ చేసి, హద్దులు చూపించాలి. ఇప్పటి వరకు ఆ పనులు చేయకుండా, అధికారులు స్థాని భూస్వాములతో కుమ్మక్కై వారి భూమిని స్వాధీనం చేసుకొనే ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నారు. లబ్ధిదారులు విషయం తెలుసుకొని గూడూరులోని నియోజకవర్గం మండల నాయకులు క్రిష్ణారెడ్డి, చిరంజీవి, షబ్బీర్‌లను సంప్రదించగా 28.06.2010 గ్రీవెన్స్‌డే సందర్భంగా లబ్ధిదారులతోపాటు, డివిజన్ కన్వీనర్ కె.వి. కృష్ణయ్యతో కలసి రెవిన్యూ అధికారులను సంప్రదించి వెంటనే సర్వే చేయించి, హద్దులు ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. అందుకు స్పందించిన తహశీల్దారు శ్రీ పెంచల కిషోర్ గారు సర్వేయర్‌ని పిలిచి 1 వారంలోగా లబ్ధిదారుల భూములకు హద్దులు చూపించమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యం. సుబ్రహ్మణ్యం, ఇజ్రాయేల్ కుమార్, చిరంజీవి, షబ్బీర్, క్రిష్ణారెడ్డి మొ॥ పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లా

## మద్యం వ్యతిరేకోద్యమానికి లోక్‌సత్తా మద్దతు

**గుంటూరు జిల్లా, నరసరావు పేట:** ఈ మద్యం షాపులు మాకొద్దు అంటూ పెట్లూరివారిపాలెం గ్రామస్తులు చేస్తున్న ఆందోళనకు లోక్‌సత్తా పార్టీ నాయకులు తమ మద్దతును తెలియజేశారు. జూన్4న గ్రామాన్ని లోక్‌సత్తా నరసరావుపేట పట్టణ అధ్యక్షులు ఈదర గోపీచంద్ జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు లలితకుమారి, పట్టణ అధ్యక్షురాలు గంటా నిర్మలా బోస్, సంఘసేవకులు వై. మధుసూదనరావులు గ్రామాన్ని సందర్శించి మద్యం వ్యతిరేక ఉద్యమం చేసిన ఎస్సీ, ఎస్టీ, కాలనీ వాసులను పరామర్శించి వారిని ఇంటర్వూలు చేశారు. ఈ సందర్భంగా వారు మద్యం వలన తమ కుటుంబాలు ఆర్దికంగా పడుతున్న ఇబ్బందులను చెప్పి ఆవేదన చెందినట్లు గోపీచంద్ తెలిపారు. తమ ఇంటి యజమానులు మద్యానికి బానిసై అనారోగ్యంతో వేలాది రూపాయలు వైద్యశాలలకు ఖర్చుచేసి తమ కుటుంబాలు చితికిపోయాయని చెప్పారన్నారు. దీంతో పాటు గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా మద్యాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వేలం పాటలకు ముందే తమ గ్రామంలో మద్యం షాపు వద్దని గ్రామస్తులు ఎక్సైజ్ సూపరిండెంట్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారని అన్నారు. ఇటీవల నిర్వహించిన వేలంపాటల్లో తమ గ్రామానికి చెందని వేరే వ్యక్తులు రూ. 65 లక్షలకు షాపును పాడుకున్నారని గ్రామస్తులు చెప్పారన్నారు. గ్రామంలో ఎవరిని కూడా మద్యం విక్రయాలు జరపకుండా కలిసికట్టుగా నిరోధిస్తామని గ్రామసర్పంచ్‌తో పాటు గ్రామపెద్దలు సైతం తమకు హామి ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులతో పాటు తమ పార్టీ నాయకులు కలిసి పట్టణంలో ప్రదర్శన నిర్వహించి ఎమ్మెల్యే, డిఎస్పీ, ఎక్సైజ్ అధికారులు, ఆర్డీఓలకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. మద్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న పెట్లూరివారిపాలెం గ్రామస్తులకు తమ పార్టీ అండగా ఉంటుందని గోపీచంద్ ప్రకటించారు.

## 'ప్రజలను తాగుబోతులను చేస్తున్న ప్రభుత్వం'

**గుంటూరు వెస్ట్ :** రాష్ట్ర ఆదాయం పెంపుపేరుతో ప్రజల్ని మద్యానికి బానిసలుగా మార్చుతున్న ప్రభుత్వ వైఖరి గర్హణీయమని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వి.శివనాగేశ్వరరావు ఒక ప్రకటనలో అన్నారు. తాగుడు వ్యసనానికి బలై లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి వీధిపాలై చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేకపోవడం విచారకరమన్నారు. నిత్యావసర వస్తువుల ధరల్ని నియంత్రించలేని ఈ ప్రభుత్వం మద్యానికి రేట్లు పెంచుకుంటూ కోట్లాది రూపాయలు రాబట్టు కోవడం దారుణమని, ప్రభుత్వ నిర్ణయాలకు బలైపోతుంది బడుగు, బలహీన వర్గాలేనన్న స్పృహ వారికి లేకపోవడం శోచనీయమన్నారు. జనసంఖ్యను బట్టి బారుషాపుల లైసెన్స్ ఫీజులు పెంచుకుంటూ ప్రజల రక్తం పిండుకుంటున్న పద్ధతి క్షమార్హం కాదన్నారు. ప్రజలు ఆరోగ్యం కాపాడవలసిన ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మద్యం వ్యాపారుల నుండి కోట్లాదిరూపాయలు లైసెన్స్‌ల ఫీజుల రూపంలో వసూలు చేసుకుంటూ బారులు, బెల్టుషాపులు నిర్వహించుకోండి అనే వైఖరి సమంజసం కాదని తెలియజేశారు.

## 'మహిళలను కంటతడి పెట్టిస్తున్న మద్యం మహమ్మారి'

**గుంటూరు :** మద్యం మహమ్మారివల్ల అనేక కుటుంబాల్లో మహిళలు కంట తడిపెడుతున్నారని మహిళా సత్తా జిల్లా అధ్యక్షురాలు కె.లలితాకుమారి అవేదన వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది కుటుంబాలను మద్యం ప్రధాన సమస్యగా పట్టి పీడిస్తుందని చెప్పారు. జూన్ 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మద్యం వేలం పాటలను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

అందుకు నిరసనగా ఆరు రోజుల పాటు నగరంలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు.

నియోజకవర్గాల్లో బెల్టు షాపులు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయన్నారు. ఎక్సైజ్ శాఖ, అధికారులకు మద్యం విక్రయ దుకాణాల నుంచి ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. జూన్ 1 నుండి జూన్ 6 వరకు నగరంలో వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు నగరంలో భిక్షాటన, రెండో రోజు గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ, మూడోరోజు కాగడాలతో నిరసన, 4వ రోజు దేవాలయాల్లో ప్రాంతాలు, జాతీయ రహదారుల్లో లైసెన్స్ దుకాణాలకు అనుమతివ్వరాదని, బెల్టుషాపులు పూర్తిగా నిషేధించాలని, మద్యం వ్యాపారాన్ని ఆదాయ వనరుగా భావించరాదని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.లలితకుమారి, కార్యదర్శి, కె.దుర్గాదేవి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, నిర్మలాదేవి, శైలజ, అంజిరెడ్డి, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యంవేలాన్ని ప్రతిఘటించండి

**పొన్నూరు :** జూన్ 7వ తేదీ మద్యం టెండర్ల వేలాన్ని ప్రతిఘటించాలని లోక్‌సత్తా పార్టీ పొన్నూరు నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళాసత్తా అధ్యక్షురాలు లలితకుమారి, కార్యదర్శి దుర్గాదేవి, నరసరావుపేట లోక్‌సత్తాపార్టీ అధ్యక్షులు గోపిచంద్, నిర్మలాబోస్, పొన్నూరు లోక్‌సత్తాపార్టీ ఇన్‌చార్జి వీరశేఖరరావు, అధ్యక్షులు పార్ధసారధిలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు లలితకుమారి ఈ ర్యాలీలో మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి ప్రతి పేదవాడి జీవితాన్ని నాశనం చేస్తున్నదని, పల్లెల్లో ఇబ్బడిముబ్బడిగా బెల్టుషాపులు ఉంచటం వల్ల వారి జీవితం సర్వనాశనం అవుతుందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. అలాగే బెల్టుషాపులను గ్రామీణ ప్రాంతాలలో పూర్తిగా నిషేధించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ స్థానిక ఐలాండ్ సెంటర్ నుండి రేపల్లె బస్టాండు, జిబిసి రోడ్డు మీదగా గాంధీబొమ్మ సెంటర్ చేరుకొని గాంధీ విగ్రహానికి లోక్‌సత్తా సభ్యులు మెమోరాండం సమర్పించారు.

## లక్ష్మీపురం బెల్టు షాపులు ప్రోత్సహించే టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

**గుంటూరు :** బెల్టుషాపులను ప్రోత్సహించే టెండర్ విధానాన్ని రద్దు చేయాలని గుంటూరు జిల్లా, నగర ప్రజలకు స్వచ్ఛంద సంస్థలకు, ప్రతి పక్ష రాజకీయ పార్టీలకు, మహిళా నేతలకు, లోక్‌సత్తా పార్టీ మహిళా విభాగం పిలుపునిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి కె. దుర్గాదేవి జూన్ 6వ తేది ఒక ప్రకటనలో తెలిపారు. పేద ప్రజల బతుకులు బుగ్గిపాలు చేసే మద్యాన్ని గ్రామాల నుంచి తరిమి వేయాలని దశల వారిగా నియంత్రణ చేస్తామని, మహిళలకు, బూటకపు మాటలుచెప్పి ఓట్లు వేయించుకొని అధికారం వచ్చిన తరువాత మద్యాన్ని ఏరులై పారించే కార్యక్రమమే ఈ టెండర్ విధానమన్నారు. దీని వలన గ్రామాలలో, హైవేలపై, వీధివీధినా బెల్టుషాపులను ప్రోత్సహిస్తూ, పెద్దలు ఆరోగ్యాన్ని, వారి సంపదని, దోపిడి చేస్తూ కుటుంబాలను నాశనం చేస్తున్నారన్నారు. మద్యం మాకొద్దు టెండరు విధానం అసలే వద్దు అని ప్రతి ఒక్క మహిళా, యువతా, మహిళా నాయకులు నడుంబిగించాలన్నారు. టెండర్ విధానాన్ని రద్దు చేయాలని తీవ్రంగా ప్రతి ఘటించాలని నిరసనలతో ఎదుర్కోవాలని ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని అన్నారు.

## లోక్‌సత్తా బలోపేతానికి చర్యలు

**గుంటూరు, పట్నం బజార్ :** పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టినట్లు లోక్‌సత్తా పార్టీ నగర శాఖ అధ్యక్షులు డాక్టర్ తోటకూర శరత్‌బాబు పేర్కొన్నారు. స్థానిక 46వ డివిజన్ శారదాకాలనీలో లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో నగరంలో అధిక డివిజన్‌లు గెలుపొందేందుకు కార్యకర్తలు నేటి నుండే కృషి చేయాలన్నారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు లోక్‌సత్తాపార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నగరపార్టీ కార్యదర్శి కొండముది సాంబయ్య మాట్లాడుతూ శారదాకాలనీలో బి ఫారం స్థానంలో రిజిస్ట్రేషన్లు జరిగితే ఈ ప్రాంత ప్రజలు బ్యాంకుల నుండి లోను తీసుకుని అభివృద్ధి చెందేందుకు అవకాశముందన్నారు. కావున ప్రభుత్వం నామమాత్రమే రేట్లకే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అరవింద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలను మద్యం మత్తులో ముంచి ఆదాయ వనరులు పెంచుకునేందుకు యత్నించడం విచారకరమన్నారు. ప్రజలు దీర్ఘకాలిక అవసరాలైన విద్యా, ఆరోగ్యం, ఉపాధి కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి అమలు చేసేందుకు లోక్‌సత్తా పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో బి.సురేష్, వి.సదాశివరావు, కృపాచారి, ఆనంద్, పివి రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 46వ డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకుంది. పార్టీ డివిజన్ అధ్యక్షులుగా కొండముది సాంబయ్య ఉపాధ్యక్షులుగా షేక్ ఖాజామస్తాన్, సంయుక్త కార్యదర్శులుగా తన్నీరు సుధారాణి, పి.గురవయ్య, శనక్కాయల వెంకటేశ్వరరావు, కె. రమేష్ ఎన్నికయ్యారు.

## లోక్‌సత్తా పార్టీ కమిటీ ఏర్పాటు

**గుంటూరు నగరంపాలెం :** స్థానిక 46వ డివిజన్ శారదా కాలనీలో నగర లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు డాక్టర్ శరత్ బాబు అధ్యక్షతన పార్టీ కార్యకర్తలు, అభిమానులు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి విచ్చేసి ప్రసంగించారు. రానున్న కార్పొరేషన్

ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీని బలోపేతం చేయాల్సిందిగా, ఆయన కోరారు నగర పార్టీ ముఖ్య కార్యదర్శి కొండమూరి సాంబయ్య మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు నివసించే కాలనీలలో బిఫారాలు స్థానంలో పక్కా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు డివిజన్ కార్యవర్గాన్ని నియమించారు. ఈ కార్యవర్గంలో అధ్యక్షులు కొండమూరి సాంబయ్య, ఉపాధ్యక్షులు గంటా దుర్గాంబ, కార్యదర్శి షేక్ ఖాజామస్తాన్, జాయింట్ సెక్రటరి తన్నీరు సుధారాణి, పి.గురవయ్య, శనక్కాలయ వెంకటేశ్వరరావు, ట్రజరర్ కె.రమేష్‌ను నియమించారు.

# తూర్పు గోదావరి జిల్లా




**తూర్పుగోదావరి జిలా, కాకినాడ :** లోక్‌సత్తా పార్టీ కాకినాడ నగర శాఖ ఆధ్వర్యంలో జూన్02 వ తేదీన సభ్యత్వ నమోదుకార్యక్రమం జరిగింది. కాకినాడ భురుగూడి సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమానికి విశేషమైన పౌర స్పందన లభించింది. సుమారు 200 మంది లోక్‌సత్తా పార్టీ కరపత్రాన్ని తీసుకుని పార్టీ పట్ల సానుకూల స్పందనను వెలిబుచ్చారు. 12 మంది సాధారణ సభ్యులుగానూ, ఒకరు ఎగ్జిక్యూటివ్ మెంబరుగాను జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షులు వై.డి. రామారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ ఆలూరు విజయలక్ష్మి, నగరశాఖ అధ్యక్షులు నెక్కంటి శ్రీనివాస్, కార్యదర్శి యమ్. శివరామకృష్ణ, కోశాధికారి మామడ సుబ్బారావు, జగన్నాధరావు మొదలైన వారు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా బలోపేతానికి చైతన్య వేదికలు

**రాజమండ్రి :** లోక్‌సత్తా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రాంతాలవారీగా చైతన్య వేదికలు నిర్వహిస్తున్నట్టు పార్టీ ప్రాంతీయ అధ్యక్షురాలు ఆర్. చంద్రకళ తెలిపారు. నగరంలోని ప్రతీ ఇంటి నుంచి ఒక మహిళను సభ్యురాలిగా చేర్చాలనే లక్ష్యంతో మూడు నెలల పాటు సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. స్థానిక గాంధీపురంలో




ఉన్న లోక్‌సత్తా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె రాజమండ్రి అర్బన్ జిల్లా అధ్యక్షుడు డా॥ వివి రామారావుతో కలిసి మాట్లాడారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడంతో పాటు మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చైతన్య వేదికలు కూడా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మహిళా సత్తా ఆధ్వర్యంలో బెల్ట్‌షాపుల నియంత్రణ, విద్యాసత్తా ఆధ్వర్యంలో ఓటు సద్వినియోగం చేసుకోవడం సహా సమాచార హక్కు చట్టం వినియోగించుకునే విధానం, యువత మద్యం వైపు ఆకర్షితులు కాకుండా చూడటానికి ఈ చైతన్య వేదికలు జరుగుతాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అవినీతిని అరికట్టడానికి చేస్తున్న పోరాటానికి చేయూత నివ్వడానికి కృషిచేస్తామన్నారు. దేశంలో అధికశాతంగా ఉన్న యువశక్తిని నిర్వీర్యం కాకుండా చేసి నిరంతరం వారిలో చైతన్యం తేవడానికి కళాశాలల్లో కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. సభ్యత్వ నమోదులో భాగంగా సాధారణ, ప్రాథమిక, ఎగ్జిక్యూటివ్ కమిటీగా నమోదు చేస్తామన్నారు. ఎవరికి సభ్యత్వం కావాలన్నా తమ పార్టీ కార్యాలయం, నాయకులను సంప్రదిస్తే వారి వద్దకే వెళ్ళి పేర్లు నమోదు చేస్తారని తెలిపారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీల సమస్యలతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కూడా పోరాటం చేయడానికి సిద్ధమవుతున్నామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జె.రవి, సుంకర శ్యాంబాబు, శ్రీనివాసరావు, పివికె. శేఖర్, చందు, సత్యనారాయణ రెడ్డి, జయప్రద పాల్గొన్నారు.

## రాజమండ్రి 'రక్త హీనత'కు త్వరలో మోక్షం!

**జూన్ నెలాఖరు నాటికి ప్రారంభం కానున్న రాజమండ్రి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్**
**సుమారు కోటి రూపాయలు వ్యయంతో సిద్ధమైతున్న సముదాయం**
**గవర్నర్‌తో ప్రారంభానికి సన్నాహాలు**

**రాజమండ్రి :** రాజమండ్రిలో రక్తం వ్యాపారానికి చుక్కెదురు కాబోతుంది. నగరంలోని రెండు బ్లడ్‌బ్యాంకుల మూసివేతతో రక్తం కొరత ఏర్పడి ప్రజలు భయాందోళనలకు గురువుతున్న సమయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అన్ని అత్యాధునిక సౌకర్యాలు,

సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణమవుతున్న బ్లడ్‌బ్యాంకును జూన్ నెలాఖరులోగా ప్రారంభించేందుకు సన్నాహాలు వేగవంతం చేశారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగాన ఆనుకుని ఉన్న స్థలంలో (పాత మున్సిఫ్ కోర్టు) నిర్మాణం చేసిన రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకును రాష్ట్ర గవర్నర్‌తో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడిస్తున్నారు, రక్తం కొరతతో రాజమండ్రిలో రోగుల, బంధువులు భయాందోళనకు గురవుతున్న సమయంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ప్రారంభోత్సవానికి పనులను వేగవంతం చేశారు. నగరంలోని జాగృతి బ్లడ్‌బ్యాంకు ఎయిడ్స్ రక్తం కేసులో మూతపడగా మరో బ్లడ్‌బ్యాంకు ధన్వంతరీని సాంకేతిక కారణాలతో మూసివేసినట్టు యాజమాన్యం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంకు అవసరమైన రక్తాన్ని అందించలేకపోవడంతో అనేక ఆస్పత్రుల్లో ప్రాణపాయ పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు కూడా నిలిచిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ పరిస్థితుల మధ్య ప్రత్యామ్నాయం చూపాలని రోగులు, వారి బంధువులతో లోక్‌సత్తా బీజేపీలు డిమాండ్ చేశాయి.



### మహిళాసత్తా చాటుతాం

**రాజమండ్రి, వి.ఎల్.పురం:** నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా అలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలకు లోక్‌సత్తా పార్టీ మహిళాసత్తా నాయకులు అవిశ్రాంత పోరాటం చేపడతామని మహిళాసత్తా నాయకురాలు ఆర్. చంద్రకళ అన్నారు. స్థానిక ఎ.వి. అప్పారావు రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద గల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మహిళసత్తా అడహాక్ కమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర పరిశీలకులు సుహాసిని, రమణిల ఆధ్వర్యంలో అడహాక్ కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షులుగా కాసా జయప్రద, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి.ఎస్. లక్ష్మి, కార్యదర్శులుగా ఉమామహేశ్వరీ, సూర్యప్రభ, న్యాయవిభాగ అధ్యక్షులుగా లలిత, ప్రచార కార్యదర్శిగా ప్రభావతి, కోశాధికారిగా కుమారి ఉషాబాలలను నియమించారు. కార్యక్రమంలో పార్టీ నగర కన్వీనరు డాక్టర్ వి.వి. రామారావు, కె.వి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లా

### పనులపై శ్వేతపత్రం విడుదల చేయండి

**శ్రీకాకుళం జిల్లా, పాతశ్రీకాకుళం :** మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తక్షణం శ్వేత పత్రం విడుదల చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.పోలినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జూన్4న ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం మున్సిపాలిటీలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ కౌన్సిల్ సమావేశాల్లో షాపుల కేటాయింపు సక్రమంగా జరగలేదని, ఎగ్జిబిషన్ టెండర్లకోసం, ప్రైవేటు హోటళ్ల కోసం కౌన్సిలర్లు వాదులాడుకుంటున్నారే తప్ప ప్రజావసరాల కోసం చర్చించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఏడాది కాలపరిమితిలో పూర్తిచేయాల్సిన వాటర్ స్కీంపనులు మూడేళ్లు పూర్తయినా ఇప్పటికీ పూర్తిచేయకపోగా, పట్టణ వాసులకు దుమ్ము ధూళి, గోతులు మాత్రం మిగిల్చారని విమర్శించారు. రోడ్లన్నీ గోతులు మయంగా మారడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, రోడ్డు ప్రక్కన ఇళ్లలో ఉన్నవారికి, షాపులకు నిత్యం దుమ్ము మాత్రం మిగులుతోందన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ యంత్రాంగం తక్షణం స్పందించి రోడ్లు బాగుచేయాలని ఆయన డిమాండ్ చేసారు. యువసత్తా జోనల్ కో ఆర్డినేటర్ పంచాది రాంబాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మహాత్మాగాంధీ పేరుతో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో మొత్తం అవినీతిచోటు చేసుకుందని పత్రికలు ఘోషించినా పట్టించుకోని ప్రభుత్వాలు ఎట్టకేలకు ఉపాధి హామీ పథకంపై కూడా అంబుడ్స్‌మెన్ కమిటిని నియమించిందన్నారు. అయితే అంబుడ్స్‌మన్ కమిటికీ స్వయం ప్రతిపత్తి కల్పించకపోవడం విచారకరమన్నారు. స్వయం ప్రతిపత్తి కల్పించకపోవడం చేత లోపాలను తెలుసుకుని, అవకతవకలపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదన్నారు. అవినీతిని పారద్రోలాలనే చిత్తశుద్ధి ఉన్నప్పుడే ఏ పథకమైనా అర్హులైన వారికి అందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో జి. అప్పలనాయుడు, కె.మోహన్‌రావు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

### కార్మికుల ఆందోళన పై ప్రభుత్వం స్పందించాలి

**ఆముదాలవలస :** గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న కాన్‌కాస్ట్ కార్మికుల ఆందోళనపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు కె.పోలినాయుడు డిమాండ్ చేశారు. జూన్5న మధ్యాహ్నం మండలంలోని దూసి కాన్‌కాస్ట్ కర్మాగారం గేటు వద్ద కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ ఇంత భారీ కర్మాగారంలో రోజుకి కేవలం 40 రూపాయల కూలీ డబ్బులకు

ఎంతో కష్టించి కార్మికులు పనిచేస్తున్నారంటే ఆశ్చర్యంగా ఉందని ఆయనన్నారు. కార్మిక చట్టాలు, ఆయాసంక్షేమ బోర్డు ఏం చేస్తున్నాయో అర్థం కావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం లోక్‌సత్తా పార్టీ ఇన్‌చార్జి తమ్మినేని ఆనంనాయుడు మాట్లాడుతూ కార్మికులంతా సమైక్యంగా పోరాడినపుడే హక్కులు సాధించగలుతామని అన్నారు. కార్మికులు చేపడుతున్న ఆందోళనపై కార్మికశాఖ అధికారులు, యాజమాన్యం స్పందించకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష చర్య చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువసత్తా అధ్యక్షుడు పంచాది రాంబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు డి.గోవిందరావు. బెండి కాశీ, టి.రాము, బి.రమణారావు, సత్యనారాయణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### సంపదను మద్యం ద్వారా దోచుకుంటున్నారు

**శ్రీకాకుళం టౌన్ :** రాత్రనక, పగలనక చెమటోడ్చి కష్టపడి సంపాదించుకున్న బడుగుల కూలి డబ్బులను రోశయ్య ప్రభుత్వం మద్యంను యదేచ్ఛగా అందుబాటులో ఉంచడం ద్వారా దోచుకుంటున్నారని లోక్‌సత్తా పార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జూన్4న జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తకోట పోలినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయమార్గంగా మాత్రమే చూస్తోందన్నారు. మద్యనియంత్రణకు తమ పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. మద్యం అమ్మకాలను భారీగా పెంచడం ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. దశలవారీగా మద్య నియంత్రణ చేస్తామని చెప్పిన ప్రభుత్వం దానిని అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని పోలినాయుడు చెప్పారు. జిల్లా యువసత్తా మహిళాసత్తా అధ్యక్షులు పంచాది రాంబాబు, వసంతలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 75లక్షల కుటుంబాలు మద్యం వలన నాశనమవుతున్నాయన్నారు. ఆదాయం కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూడకుండా మద్యం వేలం పాటలను భారీగా నిర్వహిస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. జిల్లా కోశాధికారి అల్లు మల్లేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గురుగుబిల్లి అప్పలనాయుడు మాట్లాడుతూ మద్యం వేలం పాటల వలన సిండికేట్లు ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేస్తూ జనం ఆరోగ్యం నాశనమైన తరువాత తిరిగి ఆరోగ్యశ్రీ ద్వారా కోట్లు ఖర్చు చేస్తూ వారిని బాగుచేస్తున్నామనడం ఎంతవరకు సమంజసమన్నారు. మద్యం దుకాణాలు జన సంచారం ఎక్కువగా ఉండటం వలన స్త్రీలు అటుగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం గాంధీ జపం చేసే కాంగ్రెస్ ప్రభుత్వానికి గాంధీ చెప్పిన మద్యనిషేదంగాని, నియంత్రణగాని చెవికెక్కకపోవడం శోచనీయమన్నారు.

**వేలంపాటల వద్ద సత్యాగ్రహం :** ప్రభుత్వం మద్యం వేలంపాటను నిర్వహించి ఆదాయం సమకూర్చుకునే చర్యలను నిరసిస్తూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన స్టేడియం వద్ద మహాత్మాగాంధీ చూపిన బాటలో సత్యాగ్రహం చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 5వ తేదీన 'రోశయ్య ప్రభుత్వానికి రూపాయి ధర్మం చెయ్యండి' అంటూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తామన్నారు. అలా సేకరించిన డబ్బును ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామని పార్టీ అధ్యక్షుడు పోలినాయుడు చెప్పారు. మద్యాన్ని ఆదాయ మార్గంగా చేసుకున్న ప్రభుత్వం ఆలోచనా తీరును మార్చే విధంగా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకుంటూ 6న గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తామని ఆయన ప్రకటించారు.

## ఖమ్మం జిల్లా




**ఖమ్మం జిల్లా :** ఈరోజు లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ శిక్షణా విభాగం నాయకులు బందారు రామ్మోహన్ రావు సందేశం ఇస్తూ.. చక్కెర ....భ్రమలో ఉన్న ప్రజలకు మన లోక్‌సత్తా పార్టీ చేదుమందు రుచించటం లేదు కాబట్టి మనం కూడా చేదుమందుకి చక్కెర పూత నైస్తే బాగుంటుదేమో ఆలోచించాలని కోరారు.

రాష్ట్ర కార్యదర్శి రవిమారుత్, జిల్లా అధ్యక్షుడు జూపెల్లి సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి సామినేని రాఘవులు, కార్యదర్శి చింత లింగేశ్వరరావు, భద్రు పుల్లారావు, యువసత్తా కార్యదర్శి మొ॥ మున్సిపాలిటీ/ మద్యనిషేధం కార్యక్రమాలపై నిర్దిష్టమైన ప్రణాళికను సూచించారు.

చర్ల వెంకటేశ్వరరావు, మణుగూరు చొక్కారావు, శ్రీనివాసరావు, మధిర వంగూరి రమేష్, మహంకాళి శ్రీనివాస్, ఎజిజి రామారావు, చింతకాని రామారావు ఇల్లందు కృష్ణమూర్తి, ఖమ్మం టౌన్ నాయకులు ఆర్‌యస్‌ఆర్‌కె పరేగళ్ల రాంరెడ్డి, లక్ష్మణ్, తిరుమలయపాలెం రమేష్‌తో మున్సిపాలిటీ/మద్యనిషేద కమిటీలు వేశారు. తేది 17।7।2010 మద్యనిషేద వాహనం ఖమ్మం జిల్లాలో ప్రవేశిస్తుందని తెలియచేశారు.

Top Priority

## సమాచారం కోసం దరఖాస్తు

(సమాచార హక్కు చట్టం 2005)

Time Bound

NO: 27

తేది 18.02.2010

ప్రజా సమాచార అధికారి,
ముఖ్య కార్యదర్శి కార్యాలయం,
ఆర్థిక శాఖ, సచివాలయం,
హైదరాబాద్.






• చదువు వెనుక చీకటి

**'ఉపకార' బిల్లులకు బ్రేక్**

ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడమే కారణం?

• స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రూ.682 కోట్ల బిల్లులు ఆపేయాల్సిందిగా ట్రెజరీలకు ఆర్థిక శాఖ మౌఖిక ఆదేశాలు
• 15 లక్షల మంది బీసీ విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరం
• ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాల ఒత్తిడి
• బీసీ సంక్షేమ శాఖాధికారుల సమీక్ష
• ఒకటి రెండ్రోజుల్లో బిల్లులు పాస్ చేయిస్తామని భరోసా

హైదరాబాద్, న్యూస్‌లైన్: బీసీ విద్యార్థుల భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సుమారు 15 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బిల్లులను పాస్ చేయొద్దంటూ ఆర్థిక శాఖ ట్రెజరీలకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక పరిస్థితి బాగా లేదన్న కారణంగా ఆ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దీంతో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

వాస్తవానికి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఆర్థిక శాఖ బీఓఆర్ (బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్)ను విడుదల చేసింది. బీసీ సంక్షేమ శాఖ నుంచి నిధులు విడుదల చేస్తూ జీవో కూడా జారీ అయింది. ట్రెజరీల్లో చెక్కులు సైతం పాస్ అయ్యాయి. తీరా బిల్లులు చెల్లించే సమయంలో బ్రేక్ పడింది. దీంతో వారం రోజుల క్రితం విడుదలైన రూ.682 కోట్లు ట్రెజరీల్లోనే ఆగిపోయాయి. ఈ ఏడాది మొత్తం స్కాలర్‌షిప్‌ల బడ్జెట్ రూ.1400 కోట్లు. ఇప్పటివరకు విడుదల చేసింది రూ.937 కోట్లు. ఇందులో రూ.255 కోట్ల వరకు 2008-09 సంవత్సరం బకాయి స్కాలర్‌షిప్‌లకు సర్దుబాటు చేశారు. అంటే ఈ విద్యా సంవత్సరానికి జమ అయ్యేది రూ.682 కోట్లు మాత్రమే. అందువల్ల ఇంకా రూ.718 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా నెలన్నర మాత్రమే వ్యవధి ఉండగా ఇంకాపెద్ద మొత్తంలోనే (రూ.718 కోట్లు) నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎవరూ ఊహించని విధంగా...వారం రోజుల క్రితమే విడుదల చేసిన రూ.682 కోట్లు కూడా ఆపేయండంటూ ఆర్థిక శాఖ చెప్పడంతో బీసీ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మరోవైపు కాలేజీల యాజమాన్యాలు

మిగతా 2వ పేజీలో ▶

ప్రజా సమాచార అధికారి గారికి,

సమాచార హక్కు చట్టం 2005, సెక్షన్ 6(1) ప్రకారం కింది విషయాలకు సవ గంటల్లో (02 రోజుల్లో) సెక్షన్ 2 (జె) (ii) ప్రకారం సర్టిఫైడ్ కాపీలు పంపగలరు.

1. దరఖాస్తు వెంట జతపరచిన సాక్షి దినపత్రిక తేది 18-02-2010 "చదువు వెనుక చీకటి, ఉపకార బిల్లులకు బ్రేకు" వార్తా కథనం ప్రకారం సుమారు 15 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి నిధులు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ బీఓఆర్ (బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్), బీసీ సంక్షేమ శాఖ జీవో జారీచేసిన మరియు ట్రెజరీల్లో చెక్కులు సైతం పాసయిన తర్వాత రూ.682 కోట్ల బిల్లుల చెల్లింపులు ఆపేయాల్సిందిగా రాష్ట్రవ్యాప్తంగా ట్రెజరీలకు మౌఖిక ఆదేశాలు జారీచేసిన ఆర్థిక శాఖకు చెందిన అధికారుల పేర్లు, హోదా, కార్యాలయ పూర్తి చిరునామాలు, ఫ్యాక్స్/ ఫోన్/ సెల్/ ఈమెయిల్/మౌఖిక ఆదేశాల సారాంశం మరియు నోట్‌ఫైల్స్ సర్టిఫైడ్ కాపీలు పంపగలరు.

సమాచార హక్కు (రుసుం మరియు ధరల నియంత్రణ) నియమాలు 2005 ప్రకారం దరఖాస్తు రుసుం రూ.10-00లు సవరణ జీ.వో.ఎం.ఎస్ సంఖ్య 740, తేది 01-10-2007, జీఏ (సమన్వయం, జీపీఎం&ఏఆర్) డీ., ప్రకారం కోర్టు ఫీ స్టాంపులు అతికించడమైనది.

జీ. శ్రీనివాసరావు,
C/o. సిటిజన్ హెల్ప్ సెంటర్,
లోక్‌సత్తా పార్టీ కార్యాలయం,
# 11-18-90/1, భగత్‌సింగ్ నగర్,
సరూర్‌నగర్ - 500 035,
రంగారెడ్డి జిల్లా.
సెల్ నం. 9573 593 573.

G. Srini Vasa Rao
(జీ. శ్రీనివాసరావు)

నోట్: 1. ఉత్తర ప్రత్యుత్తరాలు అధికార భాష తెలుగులో మా
సందేహ నివృత్తికి పైన పేర్కొన్న సెల్ నంబరుకు ఫో చేయ
2. జీ.వో.ఎంఎస్ సంఖ్య 114, జీఏ(సర్వీసులు-సి)డీ., మా
దరఖాస్తుదారులు కోరిన పూర్తి, ఖచ్చితమైన సమాచారమి డం



**GOVERNMENT OF ANDHRA PRADESH**
**FINANCE (W&M) DEPARTMENT**

**Letter No. 5109/82/A3/W&M/2010** **Date:- 07/05/2010**

From:
The Secretary to Government (IF),
Finance Department,
'D' Block, 2nd floor,
A.P. Secretariat,
HYDERABAD 500 022.

● ఉపశమనం...

## ఫీజులు, పావలా వడ్డీ నిధులొచ్చాయ్



● ఫీజుల రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల కోసం రూ.341 కోట్లు విడుదల... మొత్తం కావాల్సింది రూ. 1,933 కోట్లు
● రెండు మూడు రోజుల్లో రూ.250 కోట్ల పావలా వడ్డీ బకాయిల విడుదల... మొత్తం కావాల్సింది రూ. 450 కోట్లు..

To
Sri G.Srinivasa Rao,
C/o Citizen Help Centre,
Loksatta Party Office,
# 11-18-90/1, Bhagath Singh Nagar,
Saroornagar - 500035, R.R District.
Ph:- 9573593573.

Sir,

Sub:- RTI Act,2005 – request to furnish the details of applications received under RTI Act – reg.

Ref:- your application dated 18/02/2010 received on 23/02/2010.

*********

I am to invite your attention to your representation cited and to inform you the following information as requested:-

"Budget is prepared estimating the receipts and expenditure during a financial year and got approved by the Legislature as per the provisions under Constitution of India. BRO's are issued by Finance Department on quarterly basis for the schemes. Amounts are released as per the actual taxes collected and other receipts realised. When the anticipated receipts are not accrued there is no other alternative to the Government to restrict the expenditure to maintain balance of payments and issue either oral or written instructions to the DTA/PAO's to stop payments till adequate funds accrue."

Address of the Officers concerned in Finance Department:
Smt. Vasudha Mishra, IAS.,
Secretary to Government (IF),
Finance Department, A.P. Secretariat,
HYDERABAD
Phone No. 23454672, Fax No.23453479.
E-Mail: secy_bud_fin@ap.gov.in

Sri S. Chandrasekhar Rao,
Deputy Secretary to Government (W&M),
Finance Department, A.P. Secretariat,
HYDERABAD – 500 022.
Phone No. 23454386

Yours faithfully,

For Secretary to Government (IF)

Copy to:-
Finance (OP-I) Department.

# చంద్రశేఖర ఆజాద్



జూలై 23, 1906

ఫిబ్రవరి 27, 1931

జగ్‌రాణి దేవి, సీతారాం తివారీల ముద్దుబిడ్డడు
పదునైదేండ్ల వయసులో "నాపేరు ఆజాద్" అని
నిండు కోర్టుహాలులో ఎలుగెత్తి చాటి
పదునైదు కొరడా దెబ్బలు శిక్షగా పొంది
పడే ప్రతి కొరడా దెబ్బకు "భారత్ మాతాకీ జై" అని
ఘోషించిన భరతమాత వెన్న బిడ్డడు
జలియన్‌వాలాబాగ్ ఘోరకలికి నిలువెల్లా కణకణమండిన అగ్నికణం
భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, బటుకేశ్వరదత్‌లకు
ఉత్తేజాన్ని నూరిపోసిన అజాగ్రణి
సోషలిస్టు సిద్ధాంతాల ఆధారంగా పరిపూర్ణ స్వాతంత్ర్య భరతావనికై కలలుగని
హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌కు పురుడుపోసిన దేశభక్తుడు
అలాహాబాద్‌లోని అల్ఫ్రెడ్ పార్క్‌లో
చుట్టుముట్టిన సిపాయిలతో చివరిక్షణం వరకు పోరాడి
ప్రాణాలతో పట్టుబడనని చేసిన ప్రతిన నిలుపుకుంటూ
చిట్టచివరి బుల్లెట్‌ను తన కణతకే ఎక్కుపెట్టుకొని
ఇరువది నాలుగేండ్లకే అసువులు బాసిన వీరయోధుడు

నాటి యోధుల త్యాగఫలం
నేటి మన స్వాతంత్ర్యం
కుత్సితనాయకుల పదఘట్టనలో కుమిలిపోతోంది

## రండి

చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో - మరో స్వాతంత్ర పోరాటం నెరపుదాం
ముప్వన్నెల జాతీయ పతాకను సగర్వంగా ఎగరేద్దాం

**అందుకే...**

**మనచేత... మనకోసం**

**లోక్‌సత్తా పార్టీ**

RNI.Reg. No. APTEL/2010/32219






From,

To,

Book-Post

PRINTED MATTER

Lok Satta Times

H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad